విశాఖపట్టణం
శనివారం 10 జనవరి 2026

For a pure tomorrow..

# జయజయహే

jayajayahey.in | సంపుటి: 8 | సంచిక: 352 | వెల: రూ.5/- | పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool




# జాతి ప్రయోజనాలే ముఖ్యం

### విద్వేషాలు పెంచే ప్రయత్నం వద్దు
### కొందరు కావాలనే రాద్ధాంతం చేస్తున్నారు
### సమస్యలు సామరస్యంగా పరిష్కరించుకుందాం
### ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు
### రాయవరం పాస్ పుస్తకాల పంపిణీకి హాజరు




**(తూర్పుగోదావరి - జయజయహే)**

తెలుగు రాష్ట్రాల మధ్య నీటి పంపకాలు , ప్రాజెక్టుల విషయంలో నెలకొన్న వివాదాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టతనిచ్చారు. అనవసరంగా తెలుగు జాతి మధ్య విద్వేషాలు పెంచే ప్రయత్నాలు ఎవరూ చేయవద్దని ఆయన హితవు పలికారు. తనకు రాజకీయం కంటే తెలుగు ప్రజల బాధ్యత, వారి ప్రయోజనాలే ముఖ్యమని ఆయన తేల్చి చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా రాయవరంలో శుక్రవారం నిర్వహించిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాలపై మరియు రాష్ట్ర ప్రయోజనాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. నీటి విషయంలో కొందరు కావాలనే రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. నీళ్లు కావాలా? గొడవలు కావాలా? అని అడిగితే.. కొంతమంది నీళ్లు వద్దు మాకు గొడవలే కావాలని కోరుకుంటున్నారు అని ఆయన పరోక్షంగా ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించారు. సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలే తప్ప, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ అంటూ ఓ వీరుడు బయలుదేరాడు అంటూ పరోక్షంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ప్రాజెక్టుల పేరిట విద్వేషాలు రెచ్చగొట్టడం ..మిగతా 2లో



## శబరిమల ప్రధాన అర్చకుడు అరెస్టు

### ఆలయంలో గోల్డ్ చోరీ అభియోగం
### సిట్ దర్యాప్తులో 11వ అరెస్టు

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయంలో జరిగిన బంగారు ఆభరణాల దొంగతనం కేసులో సంచలన పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకుడు కందరారు రాజీవరును అరెస్టు చేసింది. ఈ కేసులో ఇప్పటివరకు ..మిగతా 2లో

## టెట్ ఫలితాలు రిలీజ్

### 97,560 మంది ఉత్తీర్ణత
### ఫలితాలు వెల్లడించిన విద్యాశాఖ

2

## నిర్లక్ష్యం సహించను

2

### అంతా బాధ్యతగా వ్యవహరించాలి
### పునరావృతమైతే క్షమించేది లేదు
### అధికారులపై చంద్రబాబు సీరియస్

# కాలుష్యం ప్రమాదకరం

### 44 శాతం నగరాలు చిక్కుల్లో
### దేశానికి ఇదే నిర్మాణాత్మక సమస్య
### సర్వే నివేదికలో వెల్లడి

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

భారతదేశంలో గాలి కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరింది. దేశంలో ఏకంగా 44 శాతం నగరాలు దీర్ఘకాలికంగా తీవ్రమైన కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి. అయితే, ఇంతటి విపత్కర పరిస్థితుల్లోనూ కేవలం 4 శాతం నగరాలకు మాత్రమే 'జాతీయ స్వచ్ఛ గాలి కార్యక్రమం' కింద రక్షణ లభిస్తోందని 'సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్' తన తాజా నివేదికలో పేర్కొంది. ఇది కేవలం తాత్కాలిక సమస్య కాదని, దేశంలో కాలుష్యం అనేది ఒక నిర్మాణాత్మకమైన సమస్యగా మారిపోయిందని ఆ సంస్థ హెచ్చరించింది. శాటిలైట్ డేటా ఆధారంగా సీఆర్ఈఏ దేశవ్యాప్తంగా సర్వే నిర్వహించింది. దేశంలోని మొత్తం 4,041 నగరాల్లోని గాలి నాణ్యతను (PM2.5 లెవల్స్) నిశితంగా పరిశీలించింది. ఇందులో ఏకంగా 1,787 నగరాలు ప్రమాదకర స్థాయిలో ఉన్నట్లు తేలింది. కరోనా ప్రభావిత 2020ని ..మిగతా 2లో



## జంగా రాజీనామా

### టీటీడీ సభ్యత్వానికి గుడ్ బై
### కాటేజీ స్థల వివాదంతో మనస్తాపం.. సీఎం చంద్రబాబుకు లేఖ

**(తిరుమల - జయజయహే)**

జంగా కృష్ణమూర్తి టీటీడీ బోర్డు సభ్యత్వానికి రాజీనామా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ మేరకు లేఖ రాశారు. అందులో తన రాజీనామాకు దారి తీసిన పరిస్థితులు వివరించారు. తన రాజీనామా ఆమోదించాలని కోరారు. తిరుమలలో శ్రీవారి సేవలో భాగం కావాలనుకున్న టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి ప్రయత్నం చివరికి వివాదాస్పదమై పదవికే ఎసరు పెట్టింది. ఇటీవల టీటీడీ బోర్డు ..మిగతా 2లో





## మళ్లీ అదే రచ్చ

### రాజధానిపై రగడ..
### జగన్ రాజకీయం రచ్చ

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

మళ్లీ అదే చర్చ. ఎప్పటిలాగే రచ్చ. జగన్ నోట అమరావతి మాట. ఇటు కూటమి నుంచి రియాక్షన్‌తో మరోసారి నవ్యాంధ్ర రాజధానిపై చర్చ షురూ అయింది. ఓవైపు రాజధానికి చట్టబద్ధత కల్పించేందుకు స్టేట్ సర్కార్ ప్రయత్నిస్తున్న క్రమంలో..జగన్ చేసిన వ్యాఖ్యల చుట్టూ వివాదం రాజుకుంది. అమరావతిపై వైసీపీ అధినే జగన్ విషం కక్కారని టీడీపీ ఆరోపిస్తుంటే..రైతుల పక్షాన జగన్ గొంతెత్తారని వైసీపీ సమర్థించుకుంటుంది. రాజధానిపై మళ్లీ చర్చ ఎందుకు స్టార్ట్ అయినట్లు.? జగన్ అమరావతి ఇష్యూను ఎందుకు గెలికినట్లు.? రాజధాని. కోటాది మంది ఆంధ్రుల ఆశల నగరం..అమరావతి చుట్టే ఏపీ రాజకీయం. అప్పటి నుంచి ..మిగతా 2లో

### పిఠాపురంలో విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే

## ఏరిపారేస్తా: పవన్ కళ్యాణ్

### పిఠాపురం సంక్రాంతి మహోత్సవాలకు హాజరు



**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిఠాపురంలో పర్యటించారు. సంక్రాంతి మహోత్సవాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. పిఠాపురంలో ఏ చిన్న ఘటన జరిగినా పెద్ద వార్త అవుతోందని ఆరోపించారు. స్కూలు పిల్లలు కొట్లాడుకుంటే కూడా పెద్ద గొడవగా చేయాలని చూశారని.. అలాంటి వాటిని ..మిగతా 2లో

### ఏపీ తీరప్రాంత సంస్కృతికి దర్పణంగా

## లైట్ హౌస్ ఫెస్టివల్

### లైట్ హౌస్ పర్యాటకం మంచి ఆలోచన
### ఇలాంటి ఉత్సవాలతో స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం
### మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు
### కనుల విందుగా విశాఖ తీరంలో లైట్ హౌస్ ఉత్సవాలు ప్రారంభం



2

## విలేకరులు కావలెను




రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా రంగాల్లో దిగ్విజయంగా అత్యధిక పాఠకుల ఆదరణ పొందుతున్న జయజయహే తెలుగు దినపత్రికకు జిల్లా ఇంచార్జి మరియు నియోజక వర్గాల వారీగా జర్నలిస్ట్ లు కావలెను. పాత్రికేయ విలువలను ప్రతిబింబిస్తూ లోతైన కథనాలు అందించే యువ జర్నలిస్టులకు ఇదే మా ఆహ్వానం.. స్వచ్ఛమైన రేపటి కోసం జయజయహే చేస్తున్న అక్షర యజ్ఞంలో మీరు భాగం అవ్వండి. జర్నలిజం సత్తాను చాటి చెప్పండి. ఆసక్తి గల వారు సంప్రదించండి...!

ఎం. కే. సునీల్ కుమార్
బ్యూరో చీఫ్
ఫోన్ : 9705347484

**నియామకాలు జరుగుతున్నాయి. వెంటనే సంప్రదించండి**

**సీనియర్లకు ప్రాధాన్యం, కొత్తవారికి కూడా అవకాశం**

యాడ్ ఎగ్జిక్యూటివ్ లకు ఆహ్వానం

షణ్ముఖ్ (యాడ్ మేనేజర్)
ఫోన్ : 7729882030

For a pure tomorrow..
జయహో

# ఏపీ తీరప్రాంత సంస్కృతికి దర్పణంగా లైట్ హౌస్ ఫెస్టివల్

## లైట్ హౌస్ పర్యాటకం మంచి ఆలోచన

### ఇలాంటి ఉత్సవాలతో స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం

### మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు

### కనుల విందుగా విశాఖ తీరంలో లైట్ హౌస్ ఉత్సవాలు ప్రారంభం

**విశాఖపట్నం, జనవరి 9, జయ జయహే**





ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఉన్న అద్భుతమైన తీరప్రాంతం, ఇక్కడి విశిష్ట సంప్రదాయాలు దేశానికే గర్వకారణమని, అటువంటి సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పేలా విశాఖపట్నంలో 'లైట్‌హౌస్ ఫెస్టివల్ 2026' నిర్వహించడం అభినందనీయమని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. కేంద్ర జలరవాణా, ఓడరేవుల మంత్రిత్వ శాఖ, లైట్‌హౌస్‌ల డైరెక్టరేట్ జనరల్ సంయుక్తంగా శుక్రవారం సాయంత్రం విశాఖ తీరంలోని ఎంజీఎం పార్కులో నిర్వహించిన లైట్ హౌస్ ఫెస్టివల్ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలోని 17 లైట్‌హౌస్‌లలో ఇప్పటికే 10 ప్రాంతాలను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్ తీరప్రాంత పర్యాటకానికి కొత్త గుర్తింపు లభించిందని చెప్పారు. ఏపీలోని వంటకాలు, ఆచారాలు, జీవనశైలి పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తాయని పేర్కొన్నారు. 2023లో గోవా, 2024లో పూరీ తర్వాత.. ఈ ప్రతిష్టాత్మక పండుగకు బంగాళాఖాతపు ముఖద్వారమైన విశాఖపట్నం వేదిక కావడం రాష్ట్ర పర్యాటక రంగానికి లభించిన పెద్ద గౌరవమని ఆయన అభివర్ణించారు. దేశవ్యాప్తంగా లైట్‌హౌస్ పర్యాటక కేంద్రాలు 6 నుండి 75కు పెరగడం, సందర్శకుల సంఖ్య 4 లక్షల నుండి 20 లక్షలకు (ఐదు రెట్లు) చేరుకోవడం మంచి విషయమన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న మెగా కార్నివాల్, హస్తకళల ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయన్నారు.

"భారతదేశానికి 11,000 కిలోమీటర్లకు పైగా సుదీర్ఘ తీరప్రాంతం ఉందని, ఈ తీరంలో 205 లైట్‌హౌస్‌లు (దీపస్తంభాలు) పర్యాటకులకు అద్భుతమైన అనుభూతిని అందించడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. కేంద్ర ఓడరేవులు, జలరవాణా మంత్రిత్వ శాఖ, లైట్‌హౌస్‌ల డైరెక్టరేట్ జనరల్ సంయుక్తంగా 75 లైట్‌హౌస్‌లను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దడం నాకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. పర్యాటకులను పెద్ద సంఖ్యలో ఆకర్షించడానికి ఇక్కడ మ్యూజియంలు, లైట్ అండ్ సౌండ్ షోలు, యాంఫీ థియేటర్లు, కెఫెటేరియాలు వంటి అత్యాధునిక సౌకర్యాలను ఏర్పాటు చేయడం వల్ల వచ్చే ఫలితాలు దేశవ్యాప్తంగా స్పష్టంగా కనిపిస్తున్నాయని చెప్పారు. లైట్‌హౌస్ పర్యాటక మౌలిక సదుపాయాలు 6 ప్రాంతాల నుండి 75 ప్రాంతాలకు విస్తరించాయని, అదేవిధంగా, సందర్శకుల సంఖ్య 4 లక్షల నుండి 20 లక్షలకు, అంటే ఐదు రెట్లు పెరగడం మంచి విషయం. " అని చెప్పారు.

"జాతీయ స్థాయిలో ఇలాంటి ఉత్సవాల ద్వారా లైట్‌హౌస్ పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచన కేవలం మూడేళ్ల కిందే పురుడు పోసుకున్నప్పటికీ, చాలా ప్రాచుర్యం పొందింది. ఇది మన సముద్ర తీర వారసత్వాన్ని ప్రోత్సహించడమే కాకుండా, పర్యాటక రంగానికి ఊతాన్నిస్తూ స్థానిక ప్రజల భాగస్వామ్యాన్ని పెంచుతుందని వెల్లడించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రాంతీయ సాంస్కృతిక ప్రదర్శనలు, కళలు, హస్తకళల మార్కెట్లు, లైట్‌హౌస్‌ల విద్యుత్ దీపాల అలంకరణ వంటి అంశాలను చేర్చడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర జలరవాణా, ఓడరేవుల శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్, ఆంధ్రప్రదేశ్ పర్యాటఖశాఖ మంత్రి కందుల దుర్గేష్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యం సహించను

**(తూర్పుగోదావరి - జయజయహే)**



పాసు పుస్తకాల పంపిణీలో నిర్లక్ష్యంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు. ఈ వ్యవహారానికి సంబంధించి అధికారులపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పాసు పుస్తకాలు తీసుకున్న రైతులంతా సభకు రాకపోవటంపై కలెక్టర్, రెవెన్యూశాఖ అధికారులపై సీఎం మండిపడ్డారు. ఎంపీ, ఎమ్మెల్యేలు కూడా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఇటువంటి ఘటనలు పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీలో పారదర్శకత ఉండాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. 'మీ భూమి మీద హక్కు' ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాసు పుస్తకాల పంపీణీ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'మీ భూమి - మీ హక్కు'... చేసి చూపించామన్నారు. రైతులకు ఎప్పుడూ అన్యాయం జరగకూడదని అన్నారు. కరోనా సమయంలోనూ పనిచేసి రైతులు అందరికీ అన్నం పెట్టారని గుర్తుచేశారు. ఏపీలో 6,680 ఎకరాల్లో రీ సర్వే చేశామని.. 22.30 లక్షల పాస్ పుస్తకాలు సిద్ధం చేశామని చెప్పారు. గత ప్రభుత్వ నేతలవి ప్రమాదకరమైన ఆలోచనలని మండిపడ్డారు చంద్రబాబు. రైతుల భూమి పత్రాలపై జగన్ ఫొటో ఎందుకు వేశారో అర్థం కాలేదని విమర్శించారు. గతంలో పట్టాదారు పాసు పుస్తకాలకు జగన్ ఫొటో పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. కూటమి అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశామని తెలిపారు. ఈ పట్టాదారు పాసు పుస్తకాన్ని ఎవరూ ట్యాంపరింగ్ చేయలేరని తెలిపారు. ఎవరైనా ట్యాంపరింగ్ చేస్తే గుర్తించి శిక్షించే పరిస్థితి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# కాలుష్యం ప్రమాదకరం

మొదటి పేజీ తరువాయి...

మినహాయించి, గత ఐదేళ్లుగా (2019-2024) ఈ నగరాల్లో కాలుష్యం జాతీయ ప్రమాణాలను మించిపోయింది. అంటే దేశంలోని 44 శాతం నగరాల ప్రజలు ప్రతిరోజూ విషాన్ని పీల్చుకుంటున్నారు. 2025 అంచనాల ప్రకారం దేశంలో అత్యంత కాలుష్య నగరాల జాబితాను నివేదిక విడుదల చేసింది. దేశంలోనే అత్యంత కాలుష్య నగరంగా బైర్నిహాట్ (అసోం) నిలిచింది(100 'స్త్ర/ఎట). దేశ రాజధాని ఢిల్లీ రెండో స్థానంలో ఉంది (96 'స్త్ర/ఎట). ఘజియాబాద్ (ఉత్తర్ ప్రదేశ్) మూడో స్థానంలో నిలిచింది (93 'స్త్ర/ఎట). వీటి తర్వాత నోయిడా, గురుగ్రామ్, గ్రేటర్ నోయిడా, భీవాడి, హాజీపూర్, ముజఫర్‌నగర్, హాపూర్ నగరాలు టాప్-10లో ఉన్నాయి.

**ప్రభుత్వ పథకం విఫలం?**

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్' క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదని నివేదిక స్పష్టం చేసింది. కాలుష్యం బారిన పడ్డ 1,787 నగరాల్లో, ఎన్‌సీఏపీ జాబితాలో ఉన్నవి కేవలం 67 మాత్రమే. అంటే 96 శాతం కాలుష్య నగరాలను ఈ పథకం పట్టించుకోవడం లేదు. మొత్తం మీద కేవలం 130 నగరాలను మాత్రమే ఎన్‌సీఏపీ కవర్ చేస్తోంది. మెజారిటీ నగరాలు క్లీన్ ఎయిర్ యాక్షన్ ప్లాన్ పరిధికి దూరంగా ఉండిపోయాయి. రాష్ట్రాల వారీగా చూస్తే యూపీలో పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉంది. అత్యధికంగా 416 కాలుష్య నగరాలు ఉత్తర్‌ప్రదేశ్‌లోనే ఉన్నాయి. ఆ తర్వాత రాజస్థాన్ (158), గుజరాత్ (152), మధ్యప్రదేశ్ (143) ఉన్నాయి. పంజాబ్, బీహార్‌లలో చెరో 136 నగరాలు, పశ్చిమ బెంగాల్‌లో 124 నగరాలు కాలుష్యంలో మగ్గుతున్నాయి. నిధుల వినియోగంలోనూ భారీ లోపాలు ఉన్నట్లు సీఆర్‌ఈఏ ఎత్తిచూపింది. ఎన్‌సీఏపీ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు రూ.13,415 కోట్లు విడుదల చేశారు. ఇందులో 74 శాతం నిధులు (రూ.9,929 కోట్లు) ఖర్చు చేశారు. కానీ ఇందులో 68 శాతం డబ్బును కేవలం రోడ్ల మీద దుమ్మును తొలగించడానికే వాడారు. వాహనాల కాలుష్య నివారణకు 14 శాతం, చెత్త దహన నివారణకు 12 శాతం వాడారు. అసలైన కాలుష్య కారకాలైన పరిశ్రమలు, ఇళ్లలో వాడే ఇంధనాల నియంత్రణకు 1 శాతం నిధులు కూడా కేటాయించలేదు.

**పీఎం10లో ఢిల్లీనే టాప్**

పీఎం10 కాలుష్యం విషయంలో ఢిల్లీ అగ్రస్థానంలో ఉంది. ఢిల్లీలో జాతీయ ప్రమాణాల కంటే మూడు రెట్లు ఎక్కువ కాలుష్యం (197 'స్త్ర/ఎట) నమోదైంది. ఘజియాబాద్, గ్రేటర్ నోయిడా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఎన్‌సీఏపీ వల్ల కేవలం 23 నగరాల్లో మాత్రమే 40 శాతం మేర కాలుష్యం తగ్గింది. మరో 23 నగరాల్లో కాలుష్యం తగ్గకపోగా, బాగా పెరిగింది. సీఆర్‌ఈఏ విశ్లేషకుడు మనోజ్ కుమార్ పలు కీలక సూచనలు చేశారు. "శాస్త్రీయ పద్ధతిలో సంస్కరణలు తేవాలి. కేవలం దుమ్ము మీద కాకుండా, సల్ఫర్ డై ఆక్సైడ్, నైట్రోజన్ డై ఆక్సైడ్ వంటి వాయువుల నియంత్రణపై దృష్టి పెట్టాలి. ఎన్‌సీఏపీ జాబితాను సవరించాలి. పరిశ్రమలు, విద్యుత్ కేంద్రాలపై కఠినమైన ఆంక్షలు విధించాలి" అని ఆయన సూచించారు.

## పిఠాపురంలో విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే

# ఏరిపారేస్తా: పవన్ కళ్యాణ్

మొదటి పేజీ తరువాయి...

ఉపేక్షించేది లేదన్నారు. తన మాటలు మెత్తగానే ఉంటాయని.. చేతలు చాలా గట్టిగా ఉంటాయని.. పిఠాపురంలో విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే కూర్చుని ఏరివేస్తానంటూ హెచ్చరించారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. సొంతనియోజకవర్గం పిఠాపురంలో జరుగుతున్న పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాలకు పవన్ కళ్యాణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన పవన్ కళ్యాణ్.. పిఠాపురంలో కాకి ఈక రాలినా కూడా పెద్ద వార్త అవుతోందని.. దానిని వైరల్ చేస్తున్నారని మండిపడ్డారు. తాటాకు చప్పుడు కూడా వైరల్ చేస్తున్నారని.. పిఠాపురం ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఏ నాయకుడి నియోజకవర్గంలోనూ పిఠాపురంలో మాదిరిగా జరగడం లేదని.. ప్రజలు ఈ విషయాలను గమనించాలని పవన్ కళ్యాణ్ కోరారు. సంక్రాంతి ఉత్సవాలకుపిఠాపురం చిరునామాగా మారాలనిపవన్ కళ్యాణ్ ఆకాంక్షించారు. సంక్రాంతి పండుగకు తెలంగాణవారిని ఆహ్వానించాలని.. గోదారి ఆతిథ్యాన్ని రుచిచూపించాలన్నారు. శ్రీపాథ వల్లభుడు వెలసిన నేల నుంచి తాను పోటీచేయడం.. అంతా భగవత్ సంకల్పంగా పవన్ కళ్యాణ్ అన్నారు.ఎమ్మెల్యేగా ఏడాది కాలంలోనే పిఠాపురం అభివృద్ధికి రూ.308 కోట్లు కేటాయించిన విషయాన్ని పవన్ కళ్యాణ్ గుర్తు చేశారు. ఈ పనులను మార్చి నాటికి పూర్తి చేస్తామని వెల్లడించారు. అధికారంలో ఉన్నా లేకపోయినా పిఠాపురం అభివృద్ధికి ఆఖరి శ్వాస వరకూ పనిచేస్తానని పవన్ కళ్యాణ్ అన్నారు. మరోవైపు పిఠాపురం పర్యటనలో వైసీపీపై పవన్ కళ్యాణ్ విమర్శలు గుప్పించారు. వైసీపీ ప్రజల మధ్య వైషమ్యాలు పెంచేందుకు ప్రయత్నిస్తోందని.. ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ వారిలో మార్పులు రాలేదని పవన్ కళ్యాణ్ అన్నారు. వారి కుట్రల్లో చిక్కుకోవద్దని ప్రజలకు సూచించారు. మరోవైపు పిఠాపురంలో ఓ స్కూల్‌లో ఇద్దరు పిల్లలు కొట్టుకున్న ఘటనను కూడా పెద్ద వార్త చేశారని.. అది కూడా తన బాధ్యత అన్నారని పవన్ కళ్యాణ్ విమర్శించారు. పులివెందులలో ఏం జరిగినా వార్త అవదని.. పిఠాపురంలో స్కూలు పిల్లలు కొట్టుకుంటే కూడా పెద్ద వార్త చేస్తున్నారని అన్నారు. చిన్న పిల్లల తగాదాలోకి కులాలను లాగి పెద్ద గొడవలా మార్చేందుకు ప్రయత్నించారని పవన్ కళ్యాణ్ ఆరోపించారు. పిఠాపురంలో తగాదాలు పెట్టి గొడవలు చేద్దామని ప్రయత్నిస్తే.. ఇక్కడే కూర్చుని ఏరివేస్తానంటూ పవన్ కళ్యాణ్ వార్నింగ్ ఇచ్చారు. తన మాటలు మెత్తగానే ఉంటాయని.. కానీ చేతలు చాలా గట్టిగా ఉంటాయని, వ్యక్తిగతంగా తీసుకుంటానని పవన్ కళ్యాణ్ హెచ్చరించారు. శాంతి భద్రతల పర్యవేక్షణ విషయంలో పోలీసులు కఠినచర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. మరోవైపు కూటమి పార్టీల మధ్య పొత్తును బలహీనం చేసేందుకు ప్రయత్నం చేయవద్దని పవన్ కళ్యాణ్ సూచించారు.

# శబరిమల ప్రధాన అర్చకుడు అరెస్టు

మొదటి పేజీ తరువాయి...

జరిగిన అరెస్టుల్లో ఇది 11వది. ఈ వివాదం 2019లో ప్రారంభమైంది. శబరిమల ఆలయ గర్భాలయ ద్వారాలకు, ద్వారపాలకుల విగ్రహాలకు బంగారు తాపడం చేసే పనులను అప్పట్లో చేపట్టారు. అయితే, ఆ పనుల కోసం వినియోగించిన బంగారంలో కొంత భాగం మాయమైందని, పాత బంగారు పలకలను తిరిగి అప్పగించడంలో గోల్ మాల్ జరిగిందనే ఆరోపణలు వచ్చాయి. ఈ అపహరణపై అనుమానాలు వ్యక్తం కావడంతో కేరళ హైకోర్టు పర్యవేక్షణలో సీట్ దర్యాప్తుకు ఆదేశించింది. రాజీవరును గుర్తు తెలియని ప్రదేశంలో ప్రశ్నించిన పోలీసులు, మధ్యాహ్నం ఆయనను సిట్ కార్యాలయానికి తరలించి అధికారికంగా అరెస్టు ప్రకటించారు. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న ఉన్నికృష్ణన్ పొట్టి, ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు మాజీ అధ్యక్షుడు పద్మకుమార్ ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగానే ఈ అరెస్టు జరిగినట్లు అధికారులు తెలిపారు. నిందితులతో రాజీవరుకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, బంగారు తాపడం పనులకు ఆయన ప్రత్యేకంగా సిఫార్సు చేయడమే కాకుండా, దేవస్థానం బోర్డు అనుమతి కోరినప్పుడు వెంటనే ఆమోదం తెలిపారని సిట్ గుర్తించింది. శబరిమల ఆలయ సంప్రదాయాల ప్రకారం ప్రధాన అర్చకుడిని తంత్రి అని పిలుస్తారు. ఈ తంత్రి పదవి అనేది వంశపారంపర్యంగా వచ్చేది. ఆలయ ఆచారాలు, శాస్త్రోక్తమైన నిర్ణయాల్లో తంత్రిదే తుది నిర్ణయం. నిత్య పూజలు చేసే మేల్ శాంతిలా కాకుండా, తంత్రి ఆలయ పవిత్రతకు సంరక్షకుడిగా ఉంటారు. అటువంటి ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తి అరెస్టు కావడం భక్తులలో తీవ్ర చర్చకు దారితీసింది. కేరళ డీజీపీ రావడ చంద్రశేఖర్ స్పందిస్తూ.. హైకోర్టు పర్యవేక్షణలో నిష్పక్షపాతంగా దర్యాప్తు జరుగుతోందని, లభించిన సాక్ష్యాధారాల బట్టే చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.

# జంగా రాజీనామా

మొదటి పేజీ తరువాయి...

ఆయనకు కాటేజీ నిర్మాణానికి స్థలం కేటాయించింది. అయితే ఆయనకు వ్యక్తిగతంగా కాకుండా ఓ ట్రస్ట్ పేరు మీద కేటాయించారు. సుమారు రెండు దశాబ్దాల క్రితం 2005లో ప్రారంభమైన ఈ కాటేజీ నిర్మాణ ప్రయత్నం, నిబంధనల ఉల్లంఘన ఆరోపణల మధ్య ఆయన రాజీనామాకు దారితీసింది. బోర్డు సభ్యుడిగా ఉంటూనే, కోట్లాది రూపాయల విలువైన స్థలాన్ని తన స్వంత ట్రస్టుకు పాత ధరలకే కట్టబెట్టుకోవాలని చూడటం ఈ వివాదానికి ప్రధాన కేంద్రబిందువైంది. తిరుమల నిబంధనల ప్రకారం, ఒకసారి వ్యక్తిగత పేరు మీద కేటాయించిన ప్లాట్‌ను ట్రస్టు పేరు మీదకు మార్చడం నిషిద్ధం. గతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో జంగా కృష్ణమూర్తి తన వ్యక్తిగత దరఖాస్తును ఓం శ్రీ నమో వెంకటేశాయ గ్లోబల్ ట్రస్టు పేరిట మార్చాలని కోరగా టీటీడీ బోర్డు దానిని తోసిపుచ్చింది. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అదే ప్లాట్‌ను ఆయన సూచించిన ట్రస్టుకు కేటాయిస్తూ బోర్డు తీర్మానం చేయడం రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపింది. ప్రస్తుతం తిరుమలలో ఒక ప్లాట్ కేటాయించాలంటే భక్తుల నుంచి దాదాపు 7 కోట్ల పైచిలుకు విరాళాలు వస్తాయి. కానీ, జంగా కృష్ణమూర్తికి కేవలం 1.1 కోట్ల రూపాయల పాత ధరకే ఆ స్థలాన్ని కేటాయించడంపై బోర్డు లోపల, బయట విమర్శలు వెల్లువెత్తాయి. స్వయంగా ఆయనే భూముల కేటాయింపు చేసే ఎస్టేట్ కమిటీ లో సభ్యుడిగా ఉండి, తనకే స్థలం కేటాయించుకోవడం కాన్ఫ్లిక్ట్ ఆఫ్ ఇంటరెస్ట్' కిందికి వస్తుందని విమర్శలు వచ్చాయి. నిజానికి తిరుమల అంతా కాంక్రీట్ జంగిల్ గా మారుతోందని కాటేజీల నిర్మాణాలకు అనుమతి ఇవ్వడం లేదు. ఈ వ్యవహారం సర్కారుకు మరియు టీటీడీ బోర్డుకు మచ్చ తెచ్చేలా ఉండటంతో, ప్రభుత్వ పెద్దల నుంచి వచ్చిన సూచనల మేరకు ఆయన రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. తన ప్రయత్నం స్వార్థం కోసం కాదని, భక్తుల కోసమేనని ఆయన చెప్పుకున్నప్పటికీ, టీటీడీ పారదర్శకతపై ప్రశ్నలు తలెత్తడంతో ఆయన వెనక్కి తగ్గక తప్పలేదని చెబుతున్నారు. జంగా కృష్ణమూర్తి కాంగ్రెస్ పార్టీ ద్వారా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. వై.ఎస్. రాజశేఖర రెడ్డి హయాంలో 2004, 2009 ఎన్నికల్లో గురజాల నియోజకవర్గం నుండి వరుసగా ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆ తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి ఆ పార్టీ బి.సి. విభాగం అధ్యక్షుడిగా, ఎమ్మెల్సీగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. అయితే వైసీపీ నాయకత్వంతో విభేదించి, 2024 ఎన్నికల ముందు ఆ పార్టీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరారు. ప్రస్తుతం ఆయన కూటమి ప్రభుత్వంలో టీటీడీ బోర్డు సభ్యునిగా నియమితులయ్యారు. కాటేజీ వివాదంతో రాజీనామా చేశారు.

# టెట్ ఫలితాలు రిలీజ్

**(అమరావతి, జయజయహే)**

టెట్ 2025 ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ ఫలితాలను వెల్లడించింది. టెట్ పరీక్షలు డిసెంబర్ 10 నుంచి 21 వరకు రాష్ట్ర వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షలకు మొత్తం 2,71,692 దరఖాస్తు చేసుకోగా.. అందులో దాదాపు 2.4లక్షల మంది మంది హాజరయ్యారు. పరీక్షల అనంతరం ప్రాథమిక ఆన్సర్ కీ విడుదల చేయగా.. అభ్యర్థుల నుంచి వచ్చిన అభ్యంతరాలను స్వీకరించింది. వీటిని పరిశీలించిన అనంతరం తుది కీ రూపొందించారు. దీంతో తాజాగా ఫైనల్ ఆన్సర్ కీతోపాటు ఫలితాలను కూడా విద్యాశాఖ విడుదల చేసింది. టెట్ పరీక్షలు రాసిన అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌లో తమ యూజర్ నేమ్, పాస్‌వర్డ్, క్యాప్చా కోడ్ ఎంటర్ చేసి టెట్ మార్కులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. తాజా టెట్ ఫలితాల్లో 97,560 మంది ఉత్తీర్ణత సాధించినట్లు కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి వెల్లడించారు. అంటే మొత్తం 2,71,692 మందిలో 39.27 శాతం మంది మాత్రమే అర్హత ఉత్తీర్ణత సాధించారన్నమాట. గతంతో పోల్చితే టెట్ ఉత్తీర్ణత ఈసారి భారీగా తగ్గింది. అయితే ఈసారి టెట్ పరీక్షలు రాసిన ఇన్‌సర్వీస్ టీచర్లలో 47.82 శాతం మంది అర్హత సాధించడం గమనార్హం. ఈ పరీక్షకు మొత్తం 31,886 మంది ఇన్ సర్వీసు ఉపాధ్యాయులు హాజరయ్యారు. వీరిలో 15,239 మంది ఉపాధ్యాయులు టెట్‌లో ఉత్తీర్ణులైనారు. టెట్ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌తోపాటు 9552300009 వాట్సప్ నెంబర్ ద్వారా కూడా తెలుసుకోవచ్చు. ఓసీ అభ్యర్థులకు 90 మార్కులు, బీసీ అభ్యర్థులకు 75 మార్కులు, ఎస్సీ / ఎస్టీ అభ్యర్థులకు 60 మార్కులు.. అపై సాధిస్తే టెట్ లో అర్హత సాధించినట్లే. టెట్ మార్కులకు లైఫ్ లాంగ్ వ్యాలిడిటీ ఉంటుంది. డీఎస్సీ రాయాలంటే అభ్యర్థులు తప్పనిసరిగా టెట్ లో అర్హత సాధించవల్సి ఉంటుంది.

# జాతి ప్రయోజనాలే ముఖ్యం

మొదటి పేజీ తరువాయి...

వల్ల కలిగే ప్రయోజనం ఏమీ ఉండదని, కేవలం రాజకీయ లబ్ధి కోసమే ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల అవసరాలను తీర్చే ప్రాజెక్టులు శాస్త్రీయంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. నాకు గొడవలు ముఖ్యం కాదు, తెలుగు జాతి అభివృద్ధి ముఖ్యం అని చంద్రబాబు స్పష్టం చేశారు. పొరుగు రాష్ట్రాలతో సమస్యలు ఉంటే కూర్చుని చర్చించుకోవాలని, అంతేకానీ ప్రజల మధ్య గోడలు కట్టేలా ప్రసంగాలు చేయకూడదని చెప్పారు. అభివృద్ధి విషయంలో రెండు రాష్ట్రాలు కలిసి ముందుకు సాగాలని, అప్పుడే తెలుగు జాతికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వస్తుందని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లో రేవంత్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. పొరుగు రాష్ట్రాలతో సత్సంబంధాలను కొనసాగిస్తూనే పెండింగ్ సమస్యలను పరిష్కరించుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నీళ్ల విషయంలో రాజకీయ లబ్ధిని చూడటం మానుకోవాలి. మాకు పొరుగు రాష్ట్రాలతో పంచాయితీలు పెట్టుకోవడం కంటే సమస్యల పరిష్కారమే ముఖ్యం అని ఆయన అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన తెలంగాణ ప్రాజెక్టులకు పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి అడ్డుపడవద్దని కోరారు. మీకు పంచాయితీలు కావాలా? నీళ్లు కావాలా? అని ఎవరైనా అడిగితే.. నాకు, నా తెలంగాణకు నీళ్లు మాత్రమే కావాలని చెబుతాను అని ఆయన పేర్కొన్నారు. వివాదాల కంటే శాశ్వత పరిష్కారాలకే మొగ్గు చూపుతామని స్పష్టం చేశారు.

# మళ్లీ అదే రచ్చ

మొదటి పేజీ తరువాయి...

అదే చర్చ. ఇప్పటికీ అదే రచ్చ. రాజధాని అమరావతి విషయంలో వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ చేసిన కామెంట్స్..మరోసారి అమరావతిపై హాట్ డిబేట్‌కు దారితీశాయి. ఏపీ రాజధాని ప్రాంతంగా అమరావతి అనుకూలమైంది కాదన్న జగన్..రాజధానికి మౌలిక సదుపాయాల కొరత ఉందని అన్నారు. లక్షల కోట్ల భారీ ప్రాజెక్ట్ అని కూడా చెప్పుకొచ్చారు. రాజధాని పేరుతో చంద్రబాబు వేలాది ఎకరాల సేకరణ పేరుతో చేస్తున్నది సరైందని కాదని కూడా జగన్ హాట్ కామెంట్స్ చేశారు. సీఎం ఎక్కడుంటే అదే రాజధాని అంటూ జగన్ చేసిన వ్యాఖ్యలపై సీఎం చంద్రబాబు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. జగన్ మరోసారి రాజధాని అంశాన్ని గెలకడంతో అమరావతి విషయంలో మళ్లీ చర్చ నడుస్తోంది. జగన్ వ్యాఖ్యలు కాస్త పొలిటికల్ డైలాగ్‌వార్‌కు దారితీశాయ్. సీఎం చంద్రబాబుతో సహా మంత్రి నారాయణ..వైసీపీ అధినేత వ్యాఖ్యలకు కౌంటర్ ఇవ్వడంతో కాక మొదలైంది.

**వైసీపీ నేతల తీరుతో గందరగోళం..**

అమరావతి రాజధాని విషయంలో వైసీపీ ఆలోచనలు మారుతున్నాయా? లేక మూడు రాజధానుల లైన్‌కే కట్టుబడి ఉన్నారా అనే చర్చ జరుగుతోంది. ఒక్కోసారి ఒక్కో తీరుగా వైసీపీ నేతలు స్పందిస్తున్న తీరు గందరగోళానికి దారితీస్తోందని మండిపడుతున్నాయి కూటమి పార్టీలు. ఓసారి మూడు రాజధానుల ముచ్చటే లేదంటారు. మరోసారి సీఎం ఎక్కడుంటే అదే రాజధాని అంటారు. అమరావతే రాజధాని కానీ..విజయవాడ, గుంటూరు మధ్య రాజధాని ఏర్పాటు చేస్తే డెవలప్‌మెంట్‌కు స్కోప్ ఉంటుందని మరో వైసీపీ నేత వాయిస్ వినిపిస్తుంటారు.

**ఇంతకు జగన్ ఉద్దేశమేంటి?**

ఇంతకు ఏపీ రాజధాని అమరావతిపై వైసీపీ స్టాండ్ ఏంటో క్లారిటీ ఇవ్వాలని..జగన్ మాటల్లో కూడా ఈ క్లారిటీ మిస్ అయిందని అంటున్నారు. రాజధానిగా అమరావతి ప్రాంతాన్ని వ్యతిరేకిస్తున్నారా? రాజధాని నిర్మాణంలో తలెత్తుతున్న సమస్యలను ప్రస్తావిస్తున్నారా? లేక మూడు రాజధానుల నినాదానికే కట్టుబడి ఉన్నారా? ఇదేది స్పష్టత లేదని అంటోంది టీడీపీ. ఓవైపు రాజధాని రైతుల సమస్యలను ప్రస్తావిస్తారు..మరోవైపు లక్షల కోట్ల భారీ ప్రాజెక్ట్ అంటారు. ఇంతకు జగన్ ఉద్దేశమేంటనేది ఎవరికి అంతు చిక్కడం లేదంటున్నారు టీడీపీ నేతలు. ఏపీకి అంటూ ఓ రాజధాని ఉండాలని ప్రజలు కోరుకుంటుంటే..జగన్ మాత్రం ఏదో ఒక ట్విస్ట్ ఇస్తూ చర్చకు..రచ్చకు ఆందోళనకు గురిచేస్తున్నారని మండిపడుతున్నారు. ప్రజల ఆకాంక్షలకు తగ్గట్లుగా..అమరావతి రైతుల కోరిక ప్రకారం రాజధానికి చట్టబద్ధత కోసం..గెజిట్ తెచ్చేందుకు ఏపీ సర్కార్ ప్రయత్నిస్తోంది. ఇలాంటి టైమ్‌లో మాజీ సీఎం జగన్ మరోసారి కన్ఫ్యూజన్ క్రియేట్ చేసేలా..మాట్లాడటం ఏంటని ప్రశ్నిస్తున్నారు టీడీపీ నేతలు. మూడు రాజధానుల నినాదంతో ఎన్నికలకు వెళ్లిన వైసీపీ దారుణంగా ఓడిపోయిందని మర్చిపోయారా అంటూ గుర్తు చేస్తున్నారు. విశాఖ ఆర్థిక రాజధాని అంటూ ఉత్తరాంధ్రలో..కనీసం కూటమి అభ్యర్థులకు గట్టి పోటీ ఇవ్వలేకపోయిందని విమర్శిస్తున్నారు. వైసీపీ ఘోర పరాజయానికి రాజధాని అంశం కూడా ప్రధాన కారణమనే విషయాన్ని మర్చిపోవద్దంటున్నారు. గుంటూరు జిల్లా నుంచి విజయవాడ వరకు వైసీపీ అడ్రస్ లేకుండా పోయిందని..అమరావతిని కాదనుకుని..మూడు రాజధానులు అంటూ కొత్త నివాదం ఎత్తుకోవడమే అందుకు కారణమంటూ వైసీపీపై అటాక్‌కు దిగుతున్నారు. ప్రతిపక్ష నాయకుడిగా..ప్రజల అభిప్రాయం..ఆకాంక్షలకు విరుద్ధంగా జగన్ మాట్లాడాల్సిన తీరు ఇది కాదంటూ తప్పుబడుతోంది టీడీపీ. రాజధాని విషయంలో వైసీపీనే కన్ఫ్యూజన్‌లో ఉందో..లేక ప్రజలనే కన్ఫ్యూజన్‌లో పెట్టి..హిడెన్ ఎజెండాతో ముందుకు వెళ్తుందో తెలియదు కానీ..ఈ గందరగోళానికి చెక్ పెట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయ్.

# మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు





**అరకులోయ: జయ జయహే.**

మండలంలోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల లో ప్రిన్సిపాల్ పట్టాసి చలపతి రావు నేతృత్వంలో ఘనంగా సంక్రాంతి సంబరాలను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అరకులోయ మండల తహసిల్దార్ కె కుమార స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పట్టాసి చలపతి రావు మాట్లాడుతూ. సంక్రాంతి అనేది కృతజ్ఞత, ఐక్యత, సంప్రదాయాల పండుగ. అనంతరం సంక్రాంతి సంబరాలు ఈ అందమైన ముగ్గుల పోటీ ఈ సంక్రాంతి అరకలోయ మన గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని, మహిళల సృజనాత్మక ప్రతిభను గౌరవిస్తున్నది. ముంగిట్లో వేసే ముగ్గులు కేవలం అలంకరణలు మాత్రమే కాదు; అవి శుభం, శ్రేయస్సు, తరతరాలుగా వచ్చిన మన విలువలకు ప్రతీకలు. ప్రతి ముగ్గు ఓర్పు, సృజనాత్మకత, మన సంస్కృతిని ప్రతిబింబిస్తుంది అని తెలిపారు. ఈ పండుగ రోజు ఇరు కళాశాల విద్యార్థులు విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని నృత్యాలు కేరింతలతో ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఎం ఆర్ ఐ పట్టాసి శంకర్ రావు. ఇరు కళాశాలల అధ్యాపకులు సుందరిరాని,నాగబాబు,విజయ లక్ష్మ. స్వర్ణలత, సుభాన్, బలరాం, మురళి కృష్ణ ,జ్యోతి,రక్షత,అన్నపూర్ణ,ప్రణీత,ప్రసాద్ విద్యార్థినులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



# భక్తి మనస్సుకు నిర్మలత్వాన్నిస్తుంది

### డాక్టర్ మల్లు వేంకట రెడ్డి, తి.తి.దే.

### గోపూజతో ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు

**కర్నూలు (జయ జయహే)**

భక్తి మనస్సుకు నిర్మలత్వాన్ని కలిగిస్తుందని, నిర్మలమైన మనస్సే దేవుని నిలయమని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహలు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సంజామల మండలం, కానాల గ్రామం, బి. సి. కాలనీలోని శ్రీరామాలయం నందు గత నాలుగు రోజులనుండి నిర్వహిస్తున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడు రోజులపాటు ఇస్కాన్ ధర్మ ప్రచారకులు నిత్యతృప్తదాస్ శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచారమండలి సభ్యులు పులి గోవర్ధన్ రెడ్డి, సిద్ధి పవన్ కుమార్ రెడ్డి, భజన మండలి సభ్యులు ముడియం కృష్ణుడు, ఎద్దుల రామకృష్ణుడు, బయటపాటి తిరుపాలు, బొడ్డుమీద నాగన్న, బత్తుల బాలతిమ్మయ్య, గడ్డం రాజా, తలారి మురళి, ధన్నవాడ రామాంజనేయులు, మహానందిగారి శివరామ స్వామి, చెన్నంపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికీ ఆలయ కమిటీ ప్రసాద వితరణ చేశారు.



# రాయచోటి అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: మంత్రి నారా లోకేశ్

### విద్య, ఐటీ , స్కిల్ డెవలప్మెంట్ రంగాల్లో ప్రాధాన్యం

### లోకేశ్‌తో మంత్రి మండిపల్లి భేటీ

**మంగళగిరి (జయ జయహే)**

రానున్న మూడేళ్లలో రాయచోటిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వ పరంగా పూర్తి సహకారం అందిస్తామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, మంత్రి నారా లోకేశ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా విద్య, ఐటీ రంగాల్లో రాయచోటిని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తామని, విద్యా సంస్థలు, ఐటీ కాలేజీలు, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల స్థాపనకు అవసరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ అభివృద్ధి కార్యక్రమాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత శాఖల నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. ఈ భేటీ సందర్భంగా రాయచోటి నియోజకవర్గ అభివృద్ధిపై సియం చంద్రబాబునాయుడు మంత్రి నారా లోకేష్ సానుకూలంగా చర్చించారని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.



# విద్యార్థులకు సంక్రాంతి సెలవులు

**కొయ్యూరు (జయ జయహే )జనవరి 10**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రేపటి నుంచి పాఠశాల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సంక్రాంతి సెలవులు ప్రారంభం కానున్నాయి.2026 సవత్సరానికి సంబంధించి సక్రాంతి పండుగ సెలవులను ప్రభుత్వం అధికారకంగా ప్రకటించింది. ఈ ఏడాది జనవరి 10వ తేది నుండి 18వ తేదివరకు వరుసగా తొమ్మిది రోజుల పాటు సెలవులు అమల్లో ఉన్నాయి. రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు విడుదల చేసారు. ప్రబుత్వ అకడమీక్ క్యాలెండర్ ప్రకారం జనవరి 10 శనివారం నుండి సెలవులు ప్రారంభం అవుతాయి. జనవరి 14 న భోగి, 15న సంక్రాంతి, మరియు 16న కనుమ పండగలు ఉన్నాయి. పండగ సెలవులు అనంతరం 19న అన్ని ప్రభుత్వ ప్రవేట్ ఏయిడెడ్ పాఠశాలలు తిరిగి ప్రారంభం కనున్నాయి.



# బౌద్ధ క్షత్రం తీర్థంపై అధికారులతో సమీక్షంచిన ఎమ్మెల్యే కొనతాల

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి శంకరం సమీపంలో గల బౌద్ధ రామక్షత్రం వద్ద కనుమ పండుగ నాడు జరుగు తీర్థంపై అధికారులతో అక్కడ జరుగు ఏర్పాట్లపై సమీక్ష చేసిన కొణతాల రామకృష్ణ ఈ సందర్బంగా అయిన మాట్లాడుతూ ఆర్కియాలజీ డిపార్ట్మెంట్ ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ గుర్తింపబడిన అనకాపల్లి బౌద్ధ క్షత్రం సంస్కృతి మరియు కళలను తెలిపే ఒక అద్భుతమైన ప్రదేశమని 9వ శతాబ్దం మధ్యనాటి వారసత్వ శిల్పకళ సంపదలలో ఇది ఒకటని, చారిత్రకంగా ముఖ్యమైన రాతితో చెక్కబడిన నిర్మింపబడిన గుహలో మరియు స్థూపాలకు ఇది ప్రసిద్ధిగాంచిన క్షత్రమని ప్రతి ఏటా కనుమ పండుగ జరుగుతుందని, ఈనెల16వ తేదీన ఇక్కడ తీర్థ మహోత్సవం అత్యంత వైభవంగా జరుపనున్నారని ఆరోజు జరుగు తీర్థం ఏర్పాట్లపై ప్రభుత్వ అధికారులతో ఆయన సమీక్ష చేయడం జరిగింది. ఈ పండగలలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని లైటింగ్, మంచినీరు, ట్రాఫిక్ విషయంలో తగు జాగ్రత్తలు వహించాలని వేల సంఖ్యలో చుట్టుపక్కల గ్రామాల నుంచి పట్టణాలనుంచి వచ్చే ప్రజలకు అసౌకర్యం కలక్కుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎటువంటి సంఘటనలు జరగకుండా తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులకు, ఉన్నత ధికారులకు ఆయన సూచించడం జరిగింది.



# చీఫ్ ఇంజనీర్ కొమ్ము సంపత్ కుమార్‌కు సత్కారం

**అనంతపురం (జయ జయహే)**

ఏపీ ఎస్పీడీసీఎల్ రాయలసీమ జోనల్ తొమ్మిది జిల్లాలు కు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా నియమించబడిన కొమ్ము సంపత్ కుమార్ ని ఎస్సీ ఎస్టీ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ముకుందాపురం రవిరాజా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేయడం జరిగింది. దళిత ప్రజా సంఘాల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నేరమెట్ల ఎల్లన్న ఎస్సీ ఎస్టీ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు. చిన్న ఆంజనేయులు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. పాలచర్ల ముత్యాలు. టిడిపి హిందూపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి. బంగి ఓబుళపతి ఆంధ్ర ప్రదేశ్ పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు. బండారు చంద్రశేఖర్ ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతపురం జిల్లా. పెద్దరాజు. గోపాల్ జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సేవకు అధికారిక హోదా అవసరం లేదు

### డా.యం.ఉమేష్ రావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి

**శ్రీకాళహస్తి,జయజయహే.**



చాలీచాలని జీతాలతో తమ జీవితాలను గడుపుతున్న పేద,మధ్యతరగతి కుటుంబాల వారికి అండగా నిలబడి,వారికి అవసరమైన సేవలు అందించడానికి అధికారిక హోదా అవసరం లేకుండా ఎవ్వరైనా సేవ చేయవచ్చని తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి సాయం కోరిన లబ్ధిదారులకు మంజూరు అయిన చెక్కులు అందజేయడానికి బొజ్జల బృందమ్మ శుక్రవారం స్థానిక 18 వార్డుకు విచ్చేసి, చెక్కులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వార్డు అధ్యక్షుడు షేక్ నూర్ మొహమ్మద్ ఆధ్వర్యంలో బొజ్జల బృందమ్మ కి స్వర్గీయ పూలే దంపతుల చిత్రపటాన్ని బహూకరించి,దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు ఏ హోదా లేకపోయినా ప్రజలకు సేవ చేయడానికి ముందుంటారని,నిస్వార్ధ సేవకు హోదా మరియు అధికారిక గుర్తింపు అవసరం లేదని,దీనికి చక్కని ఉదాహరణగా బొజ్జల బృందమ్మ నిలుస్తున్నారని కొనియాడారు. తమ పుట్టింటి నుండి వారసత్వంగా పుణికి పుచ్చుకున్న సేవా గుణాన్ని మెట్టినింటిలో కూడా కొనసాగిస్తూ,మానవతా దృక్పధంతో సమాజంలోని అన్ని వర్గాలకు అవసరమైన మేరకు పలురకాలుగా సేవలందిస్తున్న నారా భువనేశ్వరి మరియు బొజ్జల బృందమ్మ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సంక్షమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి,బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు గాదిపాకుల గోపీనాథ్, సీనియర్ నాయకులు లక్కమనేని మధుబాబు, బి.రేణుకా దేవి, మాజీ కౌన్సిలర్లు షేక్ మహబూబ్ బాషా, డా.నివేదిత మోరె, శ్రీకాళహస్తి పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్,కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్,కోట చంద్రశేఖర్,సయ్యద్ చాంద్ బాషా, రమణమూర్తి,నూర్ మొహమ్మద్, గాజుల భగత్,భరత్,కృష్ణమూర్తి,షబీనా, కరీమా,అఫ్షిన్,రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభవంతులకు చేయూత

### లబ్ధిదారులకు ఉపకారణాలు పంపిణి

### జిల్లా ఇంచార్జి కలెక్టర్ తిరుమణి శ్రీపూజా

**ఏ ఎస్ ఆర్ జిల్లా పాడేరు (జయ జయహే**





దివ్యాంగులకు చేయూతలో భాగంగా వీల్ చైర్స్, ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గోని సమాజంలోని దివ్యాంగులకు అండగా నిలవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని జిల్లా ఇంచార్జి జాయింట్ కలెక్టర్, ఐటిడిఏ ప్రాజెక్టర్ అధికారి తిరుమణి శ్రీ పూజా పేర్కొన్నారు. స్థానిక సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని దివ్యాంగులకు అవసరమైన పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి ఇలాంటి పరికరాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. లబ్ధిదారులకు వీల్ చైర్స్ 10 మందికి ట్రై సైకిల్స్ ముడు చక్రాల సైకిళ్లు 02 మందికి హ్యాండ్ (ట్రిక్స్ (చేతి స్టిక్స్) 02 మందికి అందించారు. అనంతరం లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అందులో పెదబయలు మండలం, పెడికిముడుపల్లి గ్రామానికి చెందిన వికలాంగుడు ఒంటరి చంటి తలర్సింగి గ్రామంలో అద్దె గృహంలో నివాసము అంటు ఫ్యాన్లు, మిక్సీలు, గ్రైండర్లు వాటర్ పంపులు మోటారులు రిపేర్ చేసుకుంటు జీవనం సాగిస్తున్నానని నాకు ఎటువంటి ఆధారం లేదని,నాకుప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం కావాలని జాయింట్వారిని కోరగా ఆమె సానుకూలంగా స్పందించి ఎల్డిఎం తో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని అసిస్టెంట్ డైరెక్టర్ దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారికి ఆదేశించారు. ఇలాంటి వారి సమస్యలేమైనా ఉంటే అధికారులు చొరవ తీసుకొని ప్రభుత్వం నుండి రావలసిన రాయితీలు అందే విదంగా చూడాలని, సానుకూలంగా స్పందించి వారి సమస్యలు వెంటనే పరిష్కార దిశగా ఆలోచన చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో లబ్ది పొందిన లబ్ధిదారులు తమకు అవసరమైన ఉపకరణాలను అందుకున్నామని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రతిభావంతుల సహకార సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు మరియు జిల్లా మేనేజర్ కె కవిత, వివిధ ప్రతిభావంతుల కౌన్సిలింగ్ అండ్ మోనిటరింగ్ అధికారి కె అప్పలనాయుడు ఇతర సిబ్బంది మరియు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

యలమంచిలి , జయ జయహే న్యూస్

జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందారు. శుక్రవారం పులపర్తి జంక్షన్ దాటిన తర్వాత అనకాపల్లి వైపు నుండి తుని వైపు వెళ్ళు రోడ్డు మార్గములో హైవే రోడ్డు డివైడర్ పై ఉన్న మొక్కలను నీటితో తడుపుతున్న వాటర్ ట్యాంకర్ ను వెనుక నుండి లారీ గుద్దడం వలన జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ కు నడుము భాగంలో, రెండు కాళ్లకు బలమైన రక్త గాయాలు అయ్యి అక్కడికక్కడే మరణించాడు. వాటర్ ట్యాంకర్ రోడ్ పై తిరగబడిపోయింది. చనిపోయిన లారీ డ్రైవర్ నల్గొండ జిల్లా, తస్కనిగూడెంకి చెందిన హెచ్.వెంకటయ్య (51)గా తెలిసింది. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని, ఈ యాక్సిడెంట్ విషయమై మృతుని కుటుంబ సభ్యు ల వద్ద నుండి ఫిర్యాదు స్వీకరించిన తర్వాత కేసు నమోదు చేయబడుతుందని రూరల్ ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు.



## సత్యదేవా జూనియర్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

అన్నవరం (జయ జయహే)

కాకినాడజిల్లా అన్నవరం సత్యనారాయణస్వామివారి. అనుబంధంసంస్థ అయసటువంటి.శ్రీసత్యదేవాజూనియర్ కళాశాలనందు. శుక్రవారం నాడు విద్యారలు చే. నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబారని అంటాయి. ముందుగా. ఏసి. మంజులా దేవి సత్యనారాయణ స్వామివారి చిత్రపటానికి పూల మాలవేసి జ్యోతిప్రజవ్వలన చేసి సంక్రాంతిసంబరాలు ప్రారంభించిడం జరిగింది.మన సంస్కృతికార్యక్రమాలుఅనవాయతికినిదర్శినముఅని విద్యార్థుల చే బోగిమంటలు వేయించి. పిండివంటలు గురించి తెలుయుపరుస్తూ పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించి ముగ్గులు పోటీలు నిర్వహించారు. విద్యార్థులుకు బహుమతి ప్రధానముచేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ఘంటసాల వెంకట మాట్లాడుతూ మన సంస్కృతి ఆనవాయితీ తెలియపరచడం కోసమే దృష్టిలో పెట్టుకొని సంక్రాంతి సంబరాలు ఏర్పాటు చేయడం జరిగిందని మన సంస్కృతి గురించి అవగాహన కోసమే ఈ కార్యక్రమాలును విద్యార్థులకు తెలియపరచాలని ఆయన తెలిపారు సంక్రాంతి సంబరాలు కార్యక్రమంలో ఎన్. సి. సి. యూనిట్సభ్యులు అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## జయ జయహే పత్రిక క్యాలెండర్, డైరీ ఆవిష్కరించిన మాస్ట్రో గజల్ శ్రీనివాస్







విశాఖపట్నం, జనవరి 9, జయ జయహే

విశాఖ కేంద్రంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రచురితమ వుతున్న జయ జయహే పత్రిక క్యాలెండర్, డైరీలను మాస్ట్రో గజల్ శ్రీనివాస్ ఆవిష్కరించారు. శుక్రవారం నగరంలోని హోటల్ మేఘాలయలో జయజయహే పత్రికలో ప్రచురితమైన వార్తలను చదివారు. అందులోని కథనాలు...వార్తలు...ఫోటోలను పరిశీలించి ముద్రణ అద్భుతంగా ఉందని కొనియాడారు. ఎన్నో సుదీర్ఘ ఏళ్ల నాటి పత్రికతో ధీటుగా ఈ పత్రిక ఉందని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఉన్నత ఆశయాలతో కథనాలు ప్రచురించాలని పత్రికా విలువలను పాటిస్తూ సమాజానికి ఉపయోగపడే వార్తలను అందించాలని కోరారు. ఆ ఆవిష్కరణలో జయజయహే పత్రిక మేనేజింగ్ డైరెక్టర్ పెద్దింటి సురేష్, బ్యూరో చీఫ్ ఎం. కే . సునీల్ కుమార్, ప్రత్యేక ప్రతినిధి మహ్మద్ మహబూబ్ అలీ, పట్టా ఫౌండేషన్ ప్రతినిధి రమేష్, యాడ్ మేనేజర్ షణ్ముఖ్, డిజైనర్ కె. లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల కల్తీ నెయ్యి వ్యవహారం
# విజయభాస్కర్ రెడ్డి బెయిల్ పిటిషన్ తిరస్కరణ

(జయ జయహే)

తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వ్యవహారంలో ఏ34 విజయభాస్కర్ రెడ్డి బెయిల్ కోసం పెట్టుకున్న పిటిషన్‌ను నెల్లూరులోని ఏసీబీ కోర్టు డిస్మిస్ చేసింది. శుక్రవారం ఆయన బెయిల్ పిటిషన్‌పై కోర్టులో తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జయశేఖర్ వాదిస్తూ.. ఈ కల్తీ నెయ్యి వ్యవహారంలో విజయభాస్కర్ అనుసరించిన తీరును కోర్టు దృష్టికి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సంచలన విషయాలు కోర్టుకు వెల్లడించారు.

టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తున్న కంపెనీల పనితీరు బాగా లేకపోయినా వారికి అనుకూలంగా ఆయన నివేదిక ఇచ్చారని తెలిపారు. కంపెనీల పని తీరు బాగుందని.. నెయ్యి నాణ్యంగా ఉందంటూ సర్టిఫికెట్ జారీ చేశారని చెప్పారు. ఆ క్రమంలో 2023లో భోలే బాబా కంపెనీ నుండి రూ.75 లక్షలు, ప్రీమియర్ కంపెనీ నుంచి రూ.8 లక్షలు లంచంగా విజయభాస్కర్ రెడ్డి పొందారని కోర్టుకు ఏపీపీ సోదాహరణగా వివరించారు.





ఇక అల్ఫా డైరీ కంపెనీ నుంచి ఎనిమిది గ్రాముల బంగారాన్ని లంచంగా తీసుకున్నారని చెప్పారు. ఆ యా కంపెనీలకు అనుకూలంగా నివేదిక ఇవ్వడం వల్ల గత ప్రభుత్వ హయాంలో అంటే.. 2019 - 2024 మధ్య టీటీడీకి రూ.118 కోట్ల నష్టం వాటిల్లిందని కోర్టుకు విన్నవించారు. ఇక సిట్ విచారణలో తాను లంచం తీసుకున్నట్లు ఆయన ఆంగీకరించారన్నారు. నగదు మొత్తాన్ని హవాలా రూపంలో విజయభాస్కర్ రెడ్డి తీసుకున్నట్లు తన విచారణలో సిట్ గుర్తించింది. అయితే విజయ భాస్కర్ రెడ్డి నుంచి రూ.34 లక్షలు నగదును సిట్ అధికారులు స్వాధీనం చేసుకుని.. సీజ్ చేశారు. ఈ వివరాలన్నీ ఏసీబీ కోర్టు దృష్టికి ఏపీపీ

తీసుకు వెళ్లడంలో.. విజయభాస్కర్ రెడ్డి బెయిల్‌ను న్యాయమూర్తి నిరాకరించారు

## వికసిత భారత్... ఆశయం కాదు, అనివార్యత




(సి.హెచ్.ప్రతాప్)

“వికసిత భారతు అనే భావన నేడు ఒక నినాదంగా మాత్రమే కాక, దేశ భవిష్యత్తుకు మార్గదర్శకంగా రూపుదిద్దుకుంటోంది. ఇది కేవలం ఆర్థిక వృద్ధికి సంబంధించిన మాట కాదు; సామాజిక న్యాయం, సాంకేతిక స్వావలంబన, పరిపాలనా సమర్థత, పర్యావరణ సమతుల్యతల సమ్మేళనమే వికసిత భారత్. ఒక మాటలో చెప్పాలంటే -- ప్రతి పౌరుడి జీవితంలో గుణాత్మక మార్పు తీసుకురావడమే దీని సారాంశం.

వికసిత దేశంగా అవతరించాలంటే కేవలం జీడీపీ వృద్ధి సరిపోదు. వృద్ధి ఫలాలు సమాజంలోని అట్టడుగు వర్గాలకు చేరినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. విద్య, ఆరోగ్యం, పోషణ, నివాసం వంటి ప్రాథమిక అవసరాలు ప్రతివారికి అందుబాటులోకి రావడం వికసిత భారతానికి తొలి మెట్టు. గ్రామీణ-నగర అంతరం తగ్గటం, మహిళలు--యువత--వృద్ధులకు సమాన అవకాశాలు కలగటం ఈ ప్రయాణంలో కీలక అంశాలు.

సాంకేతిక రంగంలో భారత్ సాధిస్తున్న పురోగతి వికసిత భారత దిశగా ఆశాజనక సంకేతం. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఫిన్‌టెక్, అంతరిక్ష పరిశోధనలు, స్టార్టప్ సంస్కృతి దేశానికి కొత్త ఆర్థిక శక్తిని అందిస్తున్నాయి. అయితే ఈ సాంకేతిక అభివృద్ధి ఉద్యోగాల సృష్టి, నైపుణ్యాభివృద్ధితో అనుసంధానమైనప్పుడే దీర్ఘకాలిక ఫలితాలు ఇస్తుంది. లేనిపక్షంలో, సాంకేతిక విప్లవం సామాజిక అసమానతలను పెంచే ప్రమాదముంది.

వికసిత భారత్ నిర్మాణంలో పరిపాలనా సంస్కరణలు మరో కీలక స్థంభం. పారదర్శకత, బాధ్యత, వేగవంతమైన నిర్ణయాలు ప్రజల నమ్మకాన్ని పెంచుతాయి. విధానాల అమలు కాగితాలకే పరిమితమైతే అభివృద్ధి లక్ష్యాలు సాధ్యం కావు. క్షత్రస్థాయిలో సమర్థవంతమైన అమలే నిజమైన పరీక్ష. అదే సమయంలో అవినీతిపై సున్నితమైన చర్యలు తీసుకోవడం కూడా వికసిత దేశ లక్షణం.

పర్యావరణ పరిరక్షణ లేకుండా అభివృద్ధి ఊహించలేం. పరిశ్రమల విస్తరణ, మౌలిక వసతుల నిర్మాణం ప్రకృతితో సమతుల్యంగా సాగాలి. పునరుత్పాదక శక్తులు, నీటి సంరక్షణ, కాలుష్య నియంత్రణ వంటి చర్యలు భవిష్య తరాలకు బాధ్యతగా భావించాలి. వికసిత భారత్ అంటే ప్రకృతిని జయించడం కాదు; ప్రకృతితో కలిసి ఎదగడం.

ముఖ్యంగా, వికసిత భారత్ ప్రభుత్వ ప్రాజెక్టు మాత్రమే కాదు -- ప్రజల సంకల్పం కావాలి. పౌరబాధ్యత, శ్రమపట్ల గౌరవం, నిబంధనల పాటన వంటి విలువలు బలపడితేనే అభివృద్ధి నిలకడగా ఉంటుంది. హక్కులతో పాటు కర్తవ్యాలపై అవగాహన పెరగాల్సిన అవసరం ఉంది.

అంతిమంగా, వికసిత భారత్ ఒక గమ్యం కాదు -- అది నిరంతర ప్రయాణం. ఆ ప్రయాణంలో పాలకులు విధానాలతో దారిచూపితే, పౌరులు కర్తవ్యబద్ధతతో బలమివ్వాలి. అప్పుడే భారతదేశం ఆర్థికంగా మాత్రమే కాదు, మానవ విలువల పరంగా కూడా ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుంది.



## జాగ్రత్త లేమే సైబర్ నేరగాళ్లకు అస్త్రం

(సి.హెచ్.ప్రతాప్)

కళ్లకు కనిపించని లాభాల మాయలో పడి, జీవితాంతం శ్రమించి కూడబెట్టిన నిజమైన సంపదను కోల్పోతున్న ఈ పరిస్థితి మన సమాజాన్ని ఏ దిశగా నడిపిస్తోంది? అనే ప్రశ్న నేడు ప్రతి పౌరుడి మనసును కలచివేయాల్సిన అవసరం ఉంది.. అంతర్జాతీయ షేర్ మార్కెట్లలో అద్భుత లాభాలు అంటూ చేసిన ఒక ఫోన్ కాల్, మహారాష్ట్రలోని థనేకు చెందిన 73 ఏళ్ల వృద్ధుడి జీవితాన్ని అతలాకుతలం చేసింది. ఇది ఒక్కరి విషాదం కాదు; డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ మోసాల భయానక రూపానికి తాజా ఉదాహరణ.

అక్టోబర్--నవంబర్ 2025 మధ్యకాలంలో జరిగిన ఈ ఘటన, సైబర్ నేరగాళ్ల చాకచక్యాన్ని మరోసారి బట్టబయలు చేసింది. ం44 వంటి యూకే కోడ్‌తో వచ్చిన కాల్స్, నమ్మకాన్ని పెంచేందుకు చక్కగా రూపొంచిన మాటలు, లాభాలను చూపించే నకిలీ వెబ్‌సైట్లు -- ఇవన్నీ ఒక పథకం ప్రకారం అమలు చేసిన మోసమే. “తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు” అనే మాట విన్నప్పుడు తడబడని మనిషి ఎవరు? ఆ ఆశనే ఆయుధంగా మలచుకుని, మోసగాళ్లు ఆ వృద్ధుడిని దశలవారీగా రూ.5.11 లక్షలు పెట్టుబడి పెట్టేలా చేశారు.

ఆనందం ఎక్కువ రోజులు నిలువలేదు. లాభాలను విత్‌డ్రా చేసుకునే ప్రయత్నంలో వెబ్‌సైట్లు కనిపించకుండా పోయాయి. ఫోన్లు స్విచ్ ఆఫ్ అయ్యాయి. అప్పటికే ఆలస్యం అయింది. జీవితాంతం పొదుపు చేసిన సొమ్ము, కొన్ని క్లిక్‌లలో గాలిలో కలిసిపోయింది. చివరకు పోలీసులను ఆశ్రయించినా, నేరస్తులు ఇప్పటివరకు పట్టుబడలేదు. దర్యాప్తు కొనసాగుతోందన్న అధికారుల మాటలు బాధితుడికి కొంత ఊరట ఇచ్చినా, నష్టం మాత్రం తీరనిది.

ఇక్కడ ఆలోచించాల్సినది ఒక్కటే -- ఈ మోసానికి బాధితుడు మాత్రమే బాధ్యుడా? లేక అతివేగంతో లాభాల వెనుక పరిగెత్తుతున్న మన సామూహిక మనస్తత్వమే దీనికి కారణమా? సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నట్లే, తెలియని వ్యక్తులు, ముఖ్యంగా విదేశీ నంబర్ల నుంచి ఫోన్ చేసి పెట్టుబడుల పేరుతో ఆకర్షిస్తే, అందులో మోసం దాగి ఉందని ప్రతి పౌరుడు గ్రహించాల్సిన అవసరం ఉంది. ధ్రువీకరించని వెబ్‌సైట్లు, యాప్‌లలో బ్యాంకు వివరాలు నమోదు చేయడం అంటే, నేరగాళ్లకు తాళాలు ఇవ్వడమే.

డిజిటల్ ప్రపంచం అవకాశాలతో పాటు ప్రమాదాలను కూడా మోస్తోంది. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్నంత వేగంగా, అవగాహన పెరగకపోతే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతూనే ఉంటాయి. ముఖ్యంగా వృద్ధులు, సామాన్యులు లక్ష్యంగా మారుతున్నారు. కుటుంబ సభ్యులు, సమాజం, ప్రభుత్వం -- అందరూ కలిసి ఆర్థిక సైబర్ అవగాహనను ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలి.

చివరగా ఒకటే స్పష్టంగా చెప్పాలి: లాభాలు ఆకాశాన్ని తాకుతాయని ఎవరు చెప్పినా, ముందు మన కాళ్లు నేలపై ఉన్నాయో లేదో చూసుకోవాలి. జాగ్రత్త అనే కవచం లేకపోతే, డిజిటల్ ప్రపంచంలో ఒక్క క్లిక్ కూడా ప్రాణాంతకంగా మారుతుంది. అప్రమత్తతే రక్ష. అవగాహనే ఆయుధం.

# ప్రభుత్వ ఆస్తులు ఆక్రమించకుండా పటిష్ట చర్యలు






### నైట్ పోలీసింగ్ పెంచాలి
### అవసరమైతే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి
### డీఆర్సీ సమావేశంలో ఇన్చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి

**విశాఖపట్నం, జనవరి 9, జయ జయహే:**

ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కు అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని జిల్లా ఇంచార్జి మంత్రి డోలా బాల వీరాంజ నేయ స్వామి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లో జిల్లా సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అయన మాటాడుతూ టిడ్కో గృహ నిర్మాణాల్లో మరింత వేగం పెంచేందుకు చర్యలు తీసుకుంటామని, దీనిపై ముఖ్యమంత్రి, మంత్రి నారాయణలను కలిసి నివేదిస్తానన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యాలయాలకు స్థానికంగా అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనాలు కేటాయించేందుకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పోలవరం నీరు అందుబాటులోకి వచ్చే నాటికి నిల్వ సామర్థ్యాలను పెంచేందుకు అధికారులు ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలన్నారు. కొండవాలు ప్రాంతాల్లో ఉన్న ఐరాన్ విద్యుత్ స్తంభాల స్థానంలో సిమెంట్ వి వేసేందుకు చర్యలు చేపట్టాలని, అలాగే, స్కూల్స్ లో కావలసిన అవసరాలపై స్థానిక ఎమ్మెల్యేల నుంచి సహకారం తీసుకోండన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచాలని, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగం, వ్యాపారంపై పటిష్ట నిఘా ఉంచాలన్నారు. పాఠశాలల్లో, మైదానాల్లో మద్యం సేవించటం వంటి చర్యలను ఉపేక్షంచవద్దని, నైట్ పోలీస్ పెట్రోలింగ్ పెంచాలని, ప్రభుత్వ భవనాలు, ఆస్తులు సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, అవసరం అయితే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పెండింగ్ లోని కోర్టు కేసులను పునః సమీక్షంచుకోవాలి.. తదుపరి చర్యలు చేపట్టాలని సూచన చేశారు. తర్పాలిన్ లేకుండా బొగ్గు, ఇతర ముడి సరకు రవాణా చేయెుద్దు.. ఓవర్ లోడింగ్ పై నిఘా ఉంచాలని, ఆసుపత్రుల్లో మందులు కొరత లేకుండా చూడాలి.. ముందుగానే ఇండెంట్ పెట్టుకోవాలని, వైద్యుల సర్దుబాటులో జాగ్రత్తలు తీసుకోవాలని, కేజీహెచ్ లో ఉన్న వైద్యులను తాత్కాలికంగా స్థానిక సి.హెచ్.సి.ల్లో వినియోగించుకోవాలన్నారు. ఆక్రమణల క్రమబద్ధీకరణ విషయంలో నిబంధనలకు లోబడి వేగవంతమైన చర్యలు చేపట్టాలని సూచించారు. భూముల రీ సర్వే పక్కాగా చేపట్టాలి.. పూర్తైన గ్రామాల్లో పాస్ పుస్తకాలు పంపిణీ ప్రక్రియను సజావుగా నిర్వహించాలన్నారు. 15 వేల పాస్ పుస్తకాలు వచ్చాయని, ఇంకా 8 గ్రామాల్లో రీ సర్వే చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఈ జిల్లా సమీక్ష లో ప్రభుత్వ విప్ గణబాబు, ఎంపీ శ్రీ భరత్, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, పంచకర్ల రమేష్, వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు చైర్మన్ సీతంరాజు సుధాకర్, ఏపీ గ్రోవర్స్ ఆయిల్స్ అండ్ సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ గండిబాబ్జీ, డీసీసీబీ ఛైర్మన్ కోన తాతారావు, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, డీసీపీ మేరీ ప్రశాంతి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, వి.ఎం.ఆర్.డి.ఎ. కమిషనర్ తేజ్ భరత్, జేసీ కె. మయూర్ అశోక్, విశాఖ, భీమిలి ఆర్డీవోలు, సుధాసాగర్, సంగీత్ మాధుర్, సీపీవో శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## శారదానికేతన్ పాఠశాలలో ఘనంగా
# రెండో రోజు కొనసాగిన సైన్స్ ఎక్స్‌పో

### గిరిజన సంస్కృతి ప్రదర్శనకు విశేష ఆదరణ

**అరకులోయ: జయ జయహే.**





అరకులోయ మండలంలోని శారద నికేతన్ పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పో కార్యక్రమం రెండో రోజు కూడా ఉత్సాహంగా కొనసాగింది. ఈ ఎక్స్‌పోను వీక్షంచేందుకు గవర్నమెంట్ హై స్కూల్, బీవీకే కొండ వీధి ప్రభుత్వ ప్రైమరీ స్కూల్‌లతో పాటు వివిధ పాఠశాలల నుంచి సుమారు 300 మంది విద్యార్థులు, తల్లిదండ్రులు పరిసరాల ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన సుమారు 300 ప్రదర్శనలు, వస్తుప్రదర్శనలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా గిరిజన సంప్రదాయాలు, సంస్కృతిని ప్రతిబింబించే విధంగా రూపొందించిన ప్రదర్శనలు అందరి మన్ననలు పొందాయి. గిరిజన జీవన విధానంలో వచ్చిన మార్పులు, వ్యవసాయ పద్ధతులు, పండగలు సోయిత్ పోరోబ్, హెూల్ పొడ, కొరకోత వంటి పండుగలు, థింసా నృత్యం, చెట్లు పెంచడం వల్ల కలిగే లాభాలను విద్యార్థులు వివరించారు. ఆచారాలు, విధానాలు, సంప్రదాయాలు ఉట్టిపడేలా రూపొందించిన ఈ ప్రదర్శనలు గిరిజన సాంస్కృతిక వారసత్వానికి అద్దం పట్టాయి. ఇస్రోకు సంబంధించిన డయాగ్రామ్‌లను గీసి వాటి అవసరం, ప్రాముఖ్యతను విద్యార్థులు వచ్చిన అతిథులకు వివరించారు. రెండు రోజులుగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, కళారూపాలను దగ్గరుండి వీక్షంచిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మయూరి సిల్క్ హౌస్ యజమాని బేత రాజారావు. ఎగ్జిబిషన్‌ను సందర్శించి మాట్లాడుతూ, గిరిజన సంప్రదాయాలను అద్భుతంగా ప్రతిబింబించేలా విద్యార్థులు చేసిన ప్రదర్శనలు ఎంతో అభినందనీయమన్నారు. ఇలాంటి ప్రదర్శనలు ఇంతకు ముందు ఎప్పుడూ చూడలేదని, విద్యార్థుల సృజనాత్మకతకు హ్యాట్సాఫ్ అంటూ ప్రశంసలు కురిపించారు. పాఠశాల సిబ్బంది కూడా ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. నేటి ఆధునిక సమాజంలో గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు క్రమంగా కనుమరుగవుతున్న నేపథ్యంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. గిరిజన వారసత్వాన్ని భావితరాలకు పరిచయం చేయడంలో ఈ సైన్స్ ఎక్స్‌పో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిరంజీవులు, బాబురావు, జగన్నాథం, పాఠశాల సిబ్బంది తదితరు పాల్గొన్నారు.

# వైసీపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తా

### ప్రచార విభాగ అధ్యక్షులు జీవీ రవిరాజు

**విశాఖపట్నం, జనవరి 9, జయ జయహే:**



వైసీపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా వేగంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని ఆ పార్టీ ప్రచార విభాగ అధ్యక్షులు జీవీ రవి రాజు అన్నారు. మద్దిలపాలెం, కృష్ణ కాలేజ్ రోడ్డు లో గల వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నూతనంగా నియమితులైన రవి రాజు శుక్రవారం మీడియా తో మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి ఈ కీలక బాధ్యతను అప్పగించిన పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి అంకితభావంతో సేవలందించే అవకాశం కల్పించినందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేస్తున్న ప్రతి కార్యకర్తకు ఈ నియామకం మరింత ఉత్సాహాన్ని, ప్రేరణను కలిగిస్తుందని ఆయన పేర్కొన్నారు. వైఎస్ జగన్ సమర్థవంతమైన నాయకత్వంలో అమలైన సంక్షమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజాహిత నిర్ణయాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. పార్టీ విధానాలు, సిద్ధాంతాలు, ప్రభుత్వ విజయాలను సమర్థవంతమైన ప్రచార వ్యూహాల ద్వారా ప్రజలకు చేరవేయడంలో ప్రచార విభాగం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఉమ్మడి ఉత్తరాంధ్ర పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ, బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రచార వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. సోషల్ మీడియా, డిజిటల్ మీడియా, అలాగే సంప్రదాయ ప్రచార మార్గాలను సమర్థవంతంగా వినియోగించి పార్టీ సందేశాన్ని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లే దిశగా పని చేస్తామని ఆయన స్పష్టం చేశారు. అనంతరం జిల్లా పార్టీ అధ్యక్షులు కెకె రాజుని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాజువాక సమన్వయకర్త తిప్పల శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షులు ద్రోణంరాజు శ్రీవత్సవ్, జిల్లా ప్రచార విభాగ అధ్యక్షులు జీలకర్ర నాగేంద్ర, దల్లి రామకృష్ణ రెడ్డి, కోతకాల కుమార్, బొడ్డేటి మహేష్, మధుసున్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా చండీహెూమం

**అన్నవరం (జయ జయహే)**

కాకినాడజిల్లా ప్రముఖ పుణ్య క్షత్రమైన అన్నవరం సత్యనారాయణస్వామి వారి.సన్నిధిలో. క్షత్రరక్షకిగాకొలువు దీరిన వనదుర్గమ్మవారి ఆలయంలో శుక్రవారం. ఉదయం చండీహెూమం. విగ్నేశ్వరపూజ. పుణ్యాహవచనము శ్రీసూక్తం. పురుసూక్తం. అమ్మవారిమూల మంత్రంజపపారాయణములుతో. ఘనంగాప్రారంబి. ఉదయం 11.గంటలకు హెూమగుండములోపవిత్ర సుగంధహెూమద్రవ్యములు. సమర్పించి. పూర్ణాహుతిగావించారు ఈ కార్యక్రమంలో ఆలయఅర్చకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు



## స్వామివారికి పట్టువస్త్రములు సమర్పణ

**అన్నవరం (జయ జయహే)**

కాకినాడజిల్లా అన్నవరం ప్రముఖ పుణ్య క్షేత్రమైన అన్నవరం సత్యనారాయణస్వామి వారికీ. జగ్గంపేటకు చెందిన వాస్తవ్యలుకందుల వీరవెంకట విజయ లక్ష్మ. పట్టు చీరలు. పట్టు పంచులు సుమారు 90.వేల రూపాయలు విలువ గల పట్టు వస్త్రాలును శుక్రవారం నాడు. ఈఓ. వేంద్రత్రినాధ్రావుకు అందచేశారు. ఈ కార్యక్రమం లో. ఏ ఈ. ఓ. డి. కృష్ణారావు. అర్చకులు. దత్తారాయిశర్మ. తదితరులు ఉన్నారు



## ఏజెన్సీలో క్రికెట్ టోర్నమెంటుకు కంబాల 50 వేలు రూపాయలు సహాయం

**గోకవరం జయ జయహే ప్రతినిధి**

పోలవరం జిల్లా, రంపచోడవరం నియోజకవర్గం అడ్డతీగల గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంక్రాంతి సందర్భంగా ఈ నెల 9వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఏజెన్సీ12 మండలాలకు సంబంధించి నిర్వహిస్తున్న, అల్లూరి మెమోరియల్ క్రికెట్ 2026 టోర్నమెంట్ కు, విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు 50 వేలు రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. అడ్డతీగల గ్రామానికి చెందిన అల్లూరి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ యువకులు కడబాల సుధా ఆధ్వర్యంలో గోకవరం సీఎండీ కార్యాలయంకు కంబాల శ్రీనివాసరావు వద్దకు వచ్చి సంక్రాంతి సందర్భంగా ప్రతి ఏటా గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని, అదే విధంగా ఈ ఏడాది కూడా నిర్వహిస్తున్న టోర్నమెంట్ నిర్వహణకు సహాయం అందించాలని కోరారు. స్పందించిన ఆయన 50 వేలు రూపాయలు నగదును యువకులకు అందజేశారు. అలాగే ఫైనల్లో విద్యార్థులకు ప్రైజ్ మనీ కూడా అందజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దాడ వెంకన్న దొర, కర్రి మణికంఠ, యువకులు బాలయోగి, ప్రసాద్, రవి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు



## కంబాల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ

**గోకవరం జయ జయహే ప్రతినిధి**

విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం స్థానిక దేవిచౌక్ శ్రీ కనక దుర్గమ్మ వారి ఆలయం వద్ద 50 కేజీల పులిహోర, డ్రైవర్స్ కాలనీ శ్రీ కనక దుర్గ అమ్మవారి ఆలయం, అలాగే గాదేలపాలెం గ్రామంలోని శ్రీ కనక దుర్గమ్మ అమ్మ వారి ఆలయం, ఏజెన్సీ దేవీపట్నం మండలం ఇందుకూరు పేట గ్రామంలోని శ్రీ కనక దుర్గమ్మ ఆలయం వద్ద పులిహోర ప్రసాదాన్ని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి, అనంతరం ప్రసాదాన్ని భక్తులకు వితరణ చేస్తున్నారు. ఈ శుక్రవారం కూడా యధావిధిగా ఆయా ఆలయాల వద్ద భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. గ్రామస్థులు, భక్తులందరూ అమ్మవారి తీర్థ ప్రసాదాలు తప్పకుండా స్వీకరించాలని, కంబాల శ్రీనివాసరావు కోరారు. అమ్మవారి చల్లని ఆశీస్సులతో వారం వారం దేవాలయాల వద్ద సేవా కార్యక్రమాలు జరుగుతూనే ఉంటాయన్నారు

# విద్యుత్ కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి

## తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక

**తిరుపతి, జనవరి 9, జయ జయ హే:**



తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ నూతన కమిటీ సభ్యుల ఎన్నికలు తిరుపతిలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 23 పోస్టులకు గాను 22 పోస్టులకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలుకావడంతో, అన్ని పోస్టులకు ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయని ఎన్నికల అధికారి పి. సుగుణాకర రావు తెలిపారు.

**ఎన్నికైన ముఖ్య పదవులు:**

రాష్ట్ర అధ్యక్షులుగా: పి. సాంబశివరావు (ఇబ్రహీంపట్నం)
రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా: శ్రీరామమూర్తి (ఒంగోలు)
కార్యనిర్వాహక అధ్యక్షులు: ఎం. రమేష్ (నెల్లూరు)
అదనపు ప్రధాన కార్యదర్శి: బి.వి. రవీంద్ర (రాజమహేంద్రవరం)
రాష్ట్ర కోశాధికారి: ప్రసాదు (గుంటూరు)

అలాగే ఉపాధ్యక్షులు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు, డిప్యూటీ జనరల్ సెక్రటరీలు తదితర పదవులకు కూడా 2026--2027 రెండు సంవత్సరాల కాలానికి ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయని తెలిపారు.

ఈ సందర్భంగా
రాష్ట్ర అధ్యక్షులు పి. సాంబశివరావు,
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామమూర్తి మాట్లాడుతూ, కార్మికులు, ఉద్యోగులు, అవుట్‌సోర్సింగ్ కార్మికుల హక్కుల పరిరక్షణతో పాటు వారి ప్రస్తుత సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రగతి, సమగ్ర అభివృద్ధికి విద్యుత్ రంగం మరియు విద్యుత్ సంస్థలే మూలస్తంభాలని, ఆ సంస్థల్లో విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలందించడం మనందరికీ గర్వకారణమని తెలిపారు. కార్మికుల ప్రాథమిక హక్కు అయిన కరువు భత్యం బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, వేతన సవరణ కమిటీని నియమించి వచ్చే ఏప్రిల్ 1నుంచి వేతన సవరణలను అమలు చేయాలని యాజమాన్యాన్ని విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ విద్యుత్ కంపెనీల అధ్యక్షులు, కార్యదర్శులు, అలాగే పలు జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు. టీ ఎన్ వి కే ఎస్ - ఏపీ యూనియన్ ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ విద్యుత్ కంపెనీల అధ్యక్షులు, కార్యదర్శులు, అలాగే పలు జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



# రాయవరంలో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీకి సీఎం శ్రీకారం

## క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి రైతు పొలాన్ని పరిశీలించిన చంద్రబాబు

**రాజమహేంద్రవరం, జయజయహే:**



తూర్పుగోదావరి జిల్లా మండపేట నియోజకవర్గంలోని రాయవరం గ్రామంలో నిర్వహించిన రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాయవరం గ్రామానికి చెందిన రైతు కంటిపూడి సత్యసాయిబాబాకు సీఎం స్వయంగా పట్టాదారు పాసుపుస్తకాన్ని అందజేశారు. అనంతరం పాసుపుస్తకంలో ముద్రించిన క్యూఆర్ కోడ్‌ను సెల్‌ఫోన్‌లో స్కాన్ చేయించి, మ్యాప్ ద్వారా చూపిన వివరాలను పరిశీలించారు. భూమి వివరాలు, సరిహద్దులు, విస్తీర్ణం తదితర సమాచారం డిజిటల్‌గా స్పష్టంగా కనిపించడంతో అధికారులు, రైతుతో కలిసి ముఖ్యమంత్రి పొలం వద్దకు వెళ్లి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆధునిక సాంకేతికతను భూసంస్కరణలలో వినియోగించడం ద్వారా రైతులకు పూర్తి భద్రత, పారదర్శకత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం ఈ సందర్భంగా పేర్కొన్నారు. తమ పాసుపుస్తకంలో ఎవరిఫోటోలు లేకుండా రాజముద్రతో మాత్రమే ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందని రైతు సత్యసాయిబాబా ముఖ్యమంత్రికి తెలిపారు. భూమిపై హక్కులు స్పష్టంగా నమోదుకావడం వల్ల రైతులకు నమ్మకం పెరుగుతుందని, భవిష్యత్తులో రుణాలు, పథకాల అమలుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమం రైతులలో హర్షాతిరేకాలను కలిగించింది.




# ఉభయ గోదావరిలో ఆధునాతన వైద్య సేవలకు శ్రీకర ఆసుపత్రి మైలురాయి

## చైర్మన్ డాక్టర్ అఖిల్ దాడి

**రాజమహేంద్రవరం, జయజయహే:**

ఉభయ గోదావరి జిల్లాల్లో అనుభవజ్ఞులైన వైద్య నిపుణుల బృందంతో ఆధునాతన వైద్య సేవలు అందించడం శ్రీకర ఆసుపత్రి ప్రత్యేకత అని శ్రీకర ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ అఖిల్ దాడి అన్నారు. అన్ని స్పెషాలిటీ వైద్య సేవలను సామాన్యులకు అందుబాటులో ఉంచడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. స్థానిక గాంధీపురంలో ఉన్న శ్రీకర ఆసుపత్రిలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, శ్రీకర ఆసుపత్రి సేవలు ప్రారంభించి ఏడాది పూర్తవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రోబోటిక్ నీ రీప్లేస్‌మెంట్‌తో పాటు క్రిటికల్ కేర్, న్యూరో సర్జరీ వంటి అత్యాధునిక వైద్య సేవలు అందించేందుకు ఉత్తమ వైద్య నిపుణులు 24 గంటలూ సేవలందిస్తున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ వ్యాప్తంగా శ్రీకర ఆసుపత్రికి 9 బ్రాంచీలు ఉండగా, వాటిలో 7 బ్రాంచీల్లో ఖరీదైన రోబోటిక్ నీ రీప్లేస్‌మెంట్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఇతర ఆసుపత్రులతో పోలిస్తే ఆర్థ్రోలియం, గోల్డ్ ఇంప్లాంట్ మోకాలి శస్త్రచికిత్సల్లో శ్రీకర ఆసుపత్రి ప్రత్యేక గుర్తింపు పొందిందని వివరించారు. మధ్య తరగతి, పేద వర్గాల ప్రజలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తమ ప్రధాన ఉద్దేశ్యమని డాక్టర్ అఖిల్ దాడి పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైద్య నిపుణులు డాక్టర్ రోహిత్‌కుమార్ గరిమెళ్ల, డాక్టర్ పివి చంద్రకాంత్ వర్మ, డాక్టర్ ఎన్‌జె పృథ్వీ కృష్ణ, డాక్టర్ కె. అనూష్, లక్ష్మణరావు, డాక్టర్ నవీన్ చంద్ర కిషోర్,నిరిల్ల తదితరులు పాల్గొన్నారు.

# బొమ్మూరు ఎంఎల్ఎన్ బ్లూమ్స్ పాఠశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

**రాజమహేంద్రవరం, జయజయహే:**




రాజమండ్రి రూరల్ బొమ్మూరు ఎంఎల్ఎన్ బ్లూమ్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ వాతావరణంతో అలరించిన ఈ కార్యక్రమం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో పండుగ శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ అక్షయపాత్ర శ్రీనివాస్ మాట్లాడుతూ, తమ పాఠశాలలో కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా విద్యార్థులకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల ప్రాముఖ్యతను తెలియజేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. విద్యతో పాటు సంస్కారాన్ని పెంపొందించే విధంగా ప్రతి పండుగను విద్యార్థుల చురుకైన పాల్గొనడం ద్వారా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సంక్రాంతి సంబరాల సందర్భంగా విద్యార్థులు అరిసెలు, బూరెలు, సకినాలు, పొంగలి వంటి వివిధ రకాల సంప్రదాయ పిండి వంటకాలను తయారు చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన ముగ్గులు, గొబ్బెమ్మలు, పంటల అలంకరణ అందరినీ ఆకట్టుకున్నాయి. అలాగే విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, జానపద గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు సభికుల నుంచి పెద్ద ఎత్తున ప్రశంసలు పొందాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని పిల్లలను ప్రోత్సహించారు. సంక్రాంతి సంబరాలు పాఠశాలలో పండుగ వాతావరణాన్ని నింపాయి



# మాడుగుల పాల సంఘం ద్వారా డైరీ బోనస్ పంపిణీ

**మాడుగుల జనవరి 9**

మాడుగుల విశాఖ డైరీ పాలకేంద్రం పండగ నగదు బదిలీ పథకంలో భాగంగా శుక్రవారం 257 మంది రైతులకు 32 లక్షల,7 వేల 896 రూపాయలు పంపిణీ చేశారు. ఈ మొత్తాన్ని విశాఖ గ్రామీణ బ్యాంకు ఖాతాల ద్వారా జమ చేసినట్టు డైరీ కార్యదర్శి గండి జోగినాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరీ డైరెక్టర్ సీరం రెడ్డి సూర్యనారాయణ పాల్గొని పలు రైతులకు బోనస్ చెక్కులు అందజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో విశాఖ డైరీ మేనేజర్ జి రాము, సూపర్వైజర్ ఆది అప్పారావు , స్థానిక సంఘ అధ్యక్షురాలు బండారు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# షుగర్ ఫ్యాక్టరీ వద్ద పొర్లు దండాలతో రైతులు, కార్మికులు నిరసన

**చోడవరం జనవరి 9 జయ జయ హే**

షుగర్ ఫ్యాక్టరీ లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని రైతులకు కార్మికులకు బకాయిలు చెల్లించాలని కోరుతూ రైతులు కార్మికులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమం శుక్రవారం నాటికి 8వ రోజుకి చేరుకుంది. ఈ సందర్భంగా వారంతా పోర్ల దండలతో నిరసన తెలిపారు. ఈ విషయంలో చోడవరం మాడుగుల ఎమ్మెల్యేలతో పాటు ప్రభుత్వశీ ను వేడుకుంటూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ రైతులు కార్మికులు, బకాయిలు చెల్లించుకోవడంతో పెట్టుబడులు పెట్టిన వ్యవసాయానికి గత సంవత్సరం చెరుకు పండించి షుగర్ ఫ్యాక్టరీ తరలించి నేటికీ కూడా ఫ్యాక్టరీ సొమ్ము చెల్లించక పోవడంతో వడ్డీలు కట్టలేక రైతులు విలవిల లాడుతున్నాతన్నారు. సరగడం రామనాయుడు మాట్లాడుతూ కార్మికులు జీతాలు లేక కుటుంబాలతో రోడ్డు పడే పరిస్థితి ఏర్పడిందని అదేవిధంగా షుగర్ ఫ్యాక్టరీ చైర్పర్సన్ కలెక్టర గా కి రైతులు కార్మికులు యొక్క సమస్యలు గురించి తెలియజేసిన నేటికీ కూడా బకాయిలు చెల్లింపులను చేయకపోవడంతో రైతులు కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కోన మోహన్, సిపిఐ మండల కార్యదర్శి సోమాదల దేవి, మహిళా సమాఖ్య కార్యకర్త బొబ్బిలి దేవి, సేనాపతి సత్యారావు, దండుపాటి తాతారావు, తనకల జగన్, రాయిసూరిబాబు, పొలిమేర వెంకట అప్పారావు, మద్దాల మహాలక్ష్మి నాయుడు, ఏం మల్లేశ్వర రావు,ఎస్ మల్లేశ్వరరావు రైతులు కార్మికులు పాల్గొన్నారు

# హుకుంపేటలో విద్యుత్ సరఫరా నిలిపివేత

## సర్పంచ్ పూర్ణిమ

**అరకు/హుకుంపేట: జయ జయహే.**



మండలం లోని హెడ్ క్వార్టర్ లో తేది 11-01-2026 అనగా ఆదివారం విద్యుత్ మరమ్మతులు చేయించబడును. స్ట్రీట్ లైట్స్ వేయించే కారణంగా విద్యుత్ సరఫరా ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు నిలిపి వేయబడును.. కావున హుకుంపేట మండలం హెడ్ క్వార్టర్ లో ఉండే గ్రామ ప్రజలు ఈ విషయన్ని గమనించగలరని స్థానిక సర్పంచ్ సమిడ పూర్ణిమ తెలిపారు...

# అట్టహాసంగా ప్రారంభమైన అండర్ 14 కబడ్డీ పోటీలు

**చోడవరం జనవరి 9,జయ జయ హే**



ప్రేమ సమాజం వేదిక గా స్థానిక సాకేత్ ఫౌండేషన్, క్రీడాభారతి సంయుక్తంగా నిర్వహిస్తున్న అండర్ 14 కబడ్డీ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. చోడవరం పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బాలబాలికల సుమారు 30 టీములు పోటీల్లో పాల్గొనగా మొదటి రోజు పోటీలన్నీ స్థానిక చోడవరం సభ రిజిస్టర్ గీతా లక్ష్మీ ప్రారంభించారు. క్రీడలు శారీరిక రాడుతుందో పాటు మానసిక ఉత్సాహాన్ని అందిస్తాయని క్రీడల ద్వారా దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం దొరుకుతుందని ఈ సందర్భంగా గీతా లక్ష్మీ తెలియజేశారు. మొదటి రోజు పోటీలు క్వాటర్ ఫైనల్స్ పూర్తి చేసుకోగా రెండవ రోజు 10 వ తారీఖున సెమీఫైనల్స్, ఫైనల్స్ నిర్వహించడానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో సాకేత్ ఫౌండేషన్ ప్రతినిధులు సూర్యప్రకాశ్ మాస్టారు శ్రీనివాస్ , క్రీడ భారతి ఆంధ్ర ప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్ రాజు , ఆర్.వేణుగోపాల రావు మాస్టారు, జాయింట్ సెక్రెటరీ పుల్లేటి గణేష్, వ్యాయామ ఉపాధ్యాయులు అప్పలనాయుడు ,వెంకట్రావు , శ్రీనివాస్ మాస్టారు , నాగమణి మేడం, రామకృష్ణ, చోడవరం మార్తాన్ రన్నర్ నాగేశ్వరరావు , డ్రాయింగ్ మాస్టర్ సూర్యనారాయణ , టీవీ రమణ మాస్టారు, ఆడమ్స్ పల్గున, మహతి, వాసవి, ఉషోదయ స్కూల్స్,ప్రతినిధులు పాల్గొన్నారు.

# టీడీపీ నుండి వైసీపీలో చేరికలు

## పార్టీ బలోపేతానికి కనక రెడ్డి కృషి అభినందనీయం..

## కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి

**విశాఖపట్నం (జయ జయహే)**



కూటమి ప్రభుత్వ చేతకాని పాలనకు వైసీపీలో చేరికలు నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. 35వవార్డు కల్లుపాకులు కి చెందిన దేవర రత్నం, దేవర రాజుతో పాటు మరో 100 కుటుంబాలు తెలుగుదేశం పార్టీ నుండి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ లోకి చేరారు. వాసుపల్లి గణేష్ కుమార్ చేతుల మీదుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కండువా వేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ వార్డులో పార్టీ బలోపేతానికి అలుపున కనక రెడ్డి కృషి అభినందనీయమని కొనియాడారు. కూటమి ప్రభుత్వ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చలేని చేతకాని పాలన చేస్తోందని మండిపడ్డారు. మహిళలకు యువతకు ఇచ్చిన హామీలు గాలికి వదిలేసారన్నారు. జగన్మోహన్ రెడ్డి హయాంలో పేదవాడికి అందిన పథకాలకు చంద్రబాబు ప్రభుత్వం గండి కొట్టిందని మండిపడ్డారు. పేదలు ఇంకా నిరుపేదలగానే మిగిలిపోవాలన్న చంద్రబాబు కుట్రపూరిత రాజకీయాలు సరికాదన్నారు. ప్రభుత్వ భూములు చౌక ధరకు కార్పొరేటర్లకు దారా దత్తం చేస్తున్న కూటమి ప్రభుత్వం ప్రజలకు సొంత గూడు కట్టుకునే విధంగా స్థలాలు కేటాయించలేకపోతుందన్నారు. నాడు జగన్మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి, పేదలకు అందించాలనుకున్న ఇండ్లు స్థలాలు పూర్తిగా నిర్వీర్యం చేశారని వాసుపల్లి ధ్వజమెత్తారు. చంద్రబాబు పవన్ కళ్యాణ్, లోకేష్ ఎన్నికల ముందు ప్రగాల్భాలతో జగన్మోహన్ రెడ్డి కన్నా మించి చేస్తారని ప్రజలు నమ్మి ఓట్లు వేసినందుకు నిండా ముంచేసారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వాసుపల్లి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో 35వ వార్డు దుర్గాలమ్మ ఆలయ మాజీ చైర్మన్ నాయన మల్లి బాబు, వైఎస్ఆర్సిపి సిటీ సెక్రెటరీ అబ్బిరెడ్డి ఆదివిష్ణు రెడ్డి, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులునాయన తమ్మన్నరెడ్డి. అలుపన రమణమ్మ.విశాఖ సౌత్ పబ్లిక్ వింగ్ ప్రెసిడెంట్ జీరు సూర్యనారాయణ రెడ్డి.,వైఎస్ఆర్సిపి విశాఖ సిటీ వాణిజ్య విభాగ సెక్రెటరీ కొట్టియాడ గంగాధర్. విశాఖ సిటీ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ వింగ్ సెక్రెటరీ కర్రి రాము. విశాఖ సిటీ వైయస్సార్ టి యుసి జనరల్ సెక్రెటరీ బత్తులరాము వార్డు పార్టీ వైస్ ప్రెసిడెంట్ గొరుసునాగిరెడ్డి. వార్డు మహిళా ప్రెసిడెంట్, పోలవరపు రమణమ్మ,వార్డు పార్టీ జనరల్ సెక్రెటరీలు,బ్లడ్ బ్యాంక్ లక్ష్మణ్ ఈశ్వరఅప్పలరాజు, నాయన శ్రీనివాస్ రెడ్డి. పిల్లి కనకమహాలక్ష్మి వార్డు అనుబంధ సంఘ అధ్యక్షులు యూత్ ప్రెసిడెంట్ పిల్లినగేష్, వాణిజ్య విభాగ ప్రెసిడెంట్ దొడ్డి కృష్ణవేణి, సోషల్ మీడియా ప్రెసిడెంట్ పట్నానమీనా, వైయస్సార్ టి యు సి ప్రెసిడెంట్ ఆదిరెడ్డి చంద్రశేఖర్, బూత్ కమిటీ వింగ్ ప్రెసిడెంట్, పిల్లివినోద్ కుమార్.స్టూడెంట్ విభాగ ప్రెసిడెంట్,దుర్గాప్రసాద్. ఎస్సీ సెల్ ప్రెసిడెంట్,మట్టా దుర్గాప్రసాద్, మున్సిపల్ విభాగ ప్రెసిడెంట్.నోట్ల రమణ.గ్రీవెన్స్ సెల్ ప్రెసిడెంట్, దొడ్డిగోపి,వార్డుపార్టీ సెక్రెటరీలు, ముద్దాడ గణేష్, మాలిబాబు చెప్పలక్ష్మణరావు.వార్డు మహిళా జనరల్ సెక్రెటరీ రమ్య. వాలంటరీవిభాగ ప్రెసిడెంట్ పులి హేమలత, అలుపన సంతోష్ కుమార్ రెడ్డి. పుణ్య.తదితరులు పాల్గొన్నారు.





# కార్యకర్తల అభివృద్ధి బాధ్యత నాదే

## సచివాలయ ప్రధాన, అనుబంధ కమిటీలు వేయండి..

## మళ్ళీ వచ్చేది మన వైసీపీ ప్రభుత్వమే..

## దక్షిణ సమన్వయ కమిటీలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి

**విశాఖపట్నం (జయ జయహే)**

వైసిపి పార్టీని బూత్ స్థాయిలో పూర్తిగా బలోపేతమయ్యే దిశగా కృషి చేయాలని, మీ బాధ్యత నేను తీసుకుంటానని మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ వైసీపీ శ్రేణులకు సూచించారు. రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ జాన్ వెస్లీ తో కలిసి ఆశీలమెట్ట కార్యాలయంలో శుక్రవారం దక్షిణ వైసిపి శ్రేణుల సమన్వయ కమిటీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి సచివాలయం పరిధిలో ప్రధాన, అనుబంధ కమిటీలు వేయాలని వైసీపీ విశాఖ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ ఆదేశించారు. ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ప్రతి కార్యకర్తకు రెండు సెంట్ల భూమి, ఉద్యోగం ఇస్తానానని పేర్కొన్నారు. వచ్చేది వైసీపీ ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. తెలుగు దేశం ఎమ్మెల్యేగా వున్నపుడు సైతం కార్యకర్తలకు ఇళ్ళు మంజూరు చేయించానని గుర్తు చేశారు. ఒక్క ఫోన్ కాల్ తో 10 వేల మంది కార్యకర్తలు వచ్చేలా నాయకులు కృషి చేయాలనీ పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దక్షిణ వైసీపీ శ్రేణులు, కార్యకర్తలు అనుబంధ సంఘాల నాయకులు, పాల్గొన్నారు.



# ఇరుసుమండ బ్లో అవుట్ ప్రాంతాలపై సీఎం చంద్రబాబు ఏరియల్ సర్వే

## భద్రత, నియంత్రణ చర్యలపై సమీక్ష

**రాజమహేంద్రవరం, జయజయహే:**

డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ఇరుసుమండ బ్లో అవుట్ ప్రభావిత ప్రాంతాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. బ్లో అవుట్ కారణంగా ఏర్పడిన పరిస్థితులు, ప్రమాద తీవ్రత, చేపడుతున్న నియంత్రణ చర్యలను సీఎం క్షేత్ర స్థాయిలో సమీక్షించారు. ఈ సందర్భంగా అమలాపురం ఎంపీ హరీష్ మాధుర్, జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్‌తో కలిసి ఓఎన్‌జీసీ (రాచీ+జ) ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి విస్తృతంగా చర్చలు జరిపారు. బ్లో అవుట్ ప్రభావం ప్రజల జీవన విధానంపై ఎలా ఉందన్న అంశంతో పాటు, భద్రతా చర్యలు, సహాయక చర్యల అమలు తీరును సీఎంతో అధికారులు వివరించారు. ప్రస్తుత పరిస్థితిని పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చేందుకు తీసుకుంటున్న సాంకేతిక చర్యలు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై సీఎం స్పష్టమైన సూచనలు చేశారు. బ్లో అవుట్ ప్రాంతాల్లో ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ఎలాంటి నష్టం జరగకుండా గరిష్ట భద్రతా ప్రమాణాలు పాటించాలని చంద్రబాబు ఆదేశించారు. అవసరమైతే అదనపు సాంకేతిక నిపుణులను రంగంలోకి దించి, సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఓఎన్‌జీసీ చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. అలాగే, ప్రభావిత గ్రామాల ప్రజలకు అవసరమైన వైద్య సహాయం, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు నిరంతరంగా అందేలా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజల భద్రత ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అని స్పష్టం చేసిన సీఎం, ఎలాంటి అలసత్వం లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పరిస్థితిని రోజువారీగా పర్యవేక్షిస్తూ, బ్లో అవుట్ పూర్తిగా నియంత్రణలోకి వచ్చే వరకు తగిన చర్యలు కొనసాగించాలని తెలిపారు. ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.



# క్రీడా హబ్‌గా రాజమండ్రి - ఖేలో ఇండియా నిధులతో మల్టీపర్పస్ స్టేడియం

**రాజమహేంద్రవరం, జయజయహే:**

సాంస్కృతిక రాజధానిగా గుర్తింపు పొందిన రాజమహేంద్రవరం త్వరలోనే క్రీడా హబ్‌గా మారబోతోందని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) తెలిపారు. ఖేలో ఇండియా పథకం కింద రాజమండ్రికి రూ. 13.76 కోట్ల నిధులు మంజూరవడం నగర చరిత్రలో కీలక మైలురాయిగా ఆయన అభివర్ణించారు. స్థానిక పుష్కరాల రేవు సమీపంలోని శ్రీకన్య గ్రాండ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. ఖేలో ఇండియా నిధులతో మల్టీపర్పస్ స్టేడియం నిర్మాణానికి మార్గం సుగమమైందని, ఇది స్థానిక యువతకు, క్రీడాకారులకు పెద్ద అవకాశాలను కల్పిస్తుందని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేస్తున్నామని పేర్కొంటూ, మాట ఇస్తే నిలబెట్టుకోవడమే నిజమైన పరిపాలనకు నిదర్శనమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ నిధుల మంజూరులో ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి కీలక పాత్ర పోషించారని, ఢిల్లీలో ఆమె చేసిన నిరంతర ఫాలోఅప్ వల్లే ఈ విజయం సాధ్యమైందని ఆయన తెలిపారు. గత పాలనలో క్రీడా మౌలిక సదుపాయాలపై నిర్లక్ష్యం జరిగిందని విమర్శించారు. మీడియా సమావేశంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు రూ. 9.50 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఖేలో ఇండియా స్టేడియం ద్వారా రాజమండ్రి యువత ప్రతిభను జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు.



# ప్రజా దర్బార్ నిర్వహించిన మంత్రి మండిపల్లి

**అమరావతి (జయ జయహే)**

ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని మంత్రి చెప్పారు. సమస్యలు ఎంత క్లిష్టమైనవైనా వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుండి పని చేస్తుందని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే సూచనలు, అభ్యర్థనలు పాలనకు మార్గదర్శకమని ఆయన వెల్లడించారు. ప్రజలకు మరింత చేరువ కావడమే ప్రజాదర్బార్ లక్ష్యమని మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి తెలిపారు. ప్రజలు తమకు ఎదురవుతున్న వివిధ అంశాలను మంత్రి దృష్టికి తీసుకురాగా, ప్రతి అభ్యర్థనను శ్రద్ధగా పరిశీలించి, సంబంధిత అధికారులతో చర్చించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

# శ్రీమద్రామాయణం.. రాష్ట్రస్థాయి పోటీలలో జ్యూడ్స్ పాఠశాలకు బహుమతుల పంట

**యలమంచిలి, జయ జయహే న్యూస్**



పట్టణంలోని సెయింట్ జ్యూడ్స్ పాఠశాలకు శ్రీమద్రామాయణం రాష్ట్రస్థాయి పోటీలలో బహుమతుల పంట పండింది. ఇటీవల విద్యా వికాస్ సమితి, విజయవాడ వారు నిర్వహించిన రాష్ట్రస్థాయి రామాయణ క్విజ్ పోటీలలో ఏకంగా ఆరుగురు విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచి పాఠశాల ప్రతిష్ఠను ఇనుమడింపజేశారని స్కూల్ ప్రిన్సిపాల్ రిక్కీ తెలిపారు. సీనియర్ విభాగంలో పి. వైశాలి (ప్రథమ బహుమతి), ఎం. పార్థు (ద్వితీయ బహుమతి), పి. కోటేశ్వరరావు (తృతీయ బహుమతి) సాధించగా, జూనియర్ విభాగంలో కే.సహస్ర (ప్రథమ బహుమతి), కే. జోస్విత (ద్వితీయ బహుమతి), పి.జ్వాల (తృతీయ బహుమతి) సాధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రిక్కీ మాట్లాడుతూ ముందుగా తమ పాఠశాల విద్యార్థులు సాధించిన ఈ విజయానికి వారికి అభినందనలు తెలుపుతూ తమ పాఠశాలలో కేవలం విద్యను బోధించడం మాత్రమే కాకుండా మన సంస్కృతి సాంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ విద్యార్థులకు విద్యతో పాటు భగవద్గీత, రామాయణం, భారతం నేర్పిస్తున్నామని తెలియజేస్తూ ఇటీవల భగవద్గీత పోటీలలో కూడా రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు కే.సత్యనారాయణ, శిష్టా సోమయాజులు, మళ్ల రాము హాజరయ్యారు. ఈ సందర్భంగా సోమయాజులు మాట్లాడుతూ రామాయణం అనేది కేవలం కాల్పనిక కథ కాదని నిజజీవితంలో మనిషి ప్రతిక్షణం ఏ విధంగా బ్రతకాలో, నడుచుకోవాలో తెలియజేసే అద్భుత చరిత్ర అన్నారు. అనంతరం ముఖ్య అతిథుల చేతుల మీదుగా రామాయణ పోటీ విజేతలకు మరియు సంక్రాంతి సంబరాల్లో భాగంగా హరిదాసు అలంకరణలో అలరించిన పదిమంది విద్యార్థులకు జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రిక్కీ, లీగల్ అడ్వైజర్ జస్బీర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# పురుషోత్తపురం జిల్లా పరిషత్ హై స్కూల్‌ని సందర్శించిన ఎంపీపీ

**యలమంచిలి, జయ జయహే న్యూస్**

మండలంలోని పురుషోత్తపురం జిల్లా పరిషత్ హై స్కూల్ మధ్యాహ్న భోజనం పథకాన్ని ఎంపీపీ శేషు పరిశీలించారు. అనంతరం సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు మొదటి బహుమతి వచ్చిన పదవ తరగతి విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం శోభా రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

For a pure tomorrow.. జయహే

# కేవీఆర్ లగ్జ్.. స్టైలిష్ విజన్!

- ఎండాడలో కేవీఆర్ డెవలపర్స్ సరికొత్త ప్రాజెక్టు
- అత్యాధునిక వసతులతో సరికొత్త అపార్ట్‌మెంట్లు
- 163 త్రీ బెచ్ కే ఫ్లాట్లతో 11 అంతస్తుల నిర్మాణం
- విశాఖకు తలమానికంగా ప్రతిష్టాత్మకంగా భవనం

విశాఖపట్నం.. అనే పేరు ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో మారుమ్రోగుతోంది. దేశానికే ఈ సాగర నగరం విశాఖ తలమానికంగా రుపాంతరం చెందుతోంది. దేశంలోనే కాకుండా, ప్రపంచ స్థాయిలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో విశాఖ చాలా ముందంజలో ఉంది. ఓ వైపు సహజమైన ప్రకృతి సౌందర్యం.. మరోవైపు అపార వనరులు విశాఖ సొంతం కావడంతో ఈ నగరానికి ఇప్పుడు అంతర్జాతీయ స్థాయి సంస్థలు సైతం క్యూ కడుతున్నాయి. ప్రపంచ ఐటీ దిగ్గజ సంస్థలు గూగుల్, బ్రూక్ ఫీల్డ్,మెటా, కాగ్నిజెంట్, యాక్సెంచర్ వంటివి విశాఖ నుంచి తమ కార్యకలాపాలకు శ్రీకారం చుట్టేందుకు దిగి వస్తుండటంతో అంతర్జాతీయ స్థాయి వ్యాపార, వాణిజ్య దిగ్గజ వర్గాల్లో విశాఖ పేరు ఇప్పుడు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. కేవలం విశాఖకు మాత్రమే పరిమితం కాకుండా ఉత్తరాంధ్ర అంతటా ఈ ప్రభావం చూపుతోంది. రాష్ట్రానికి అత్యంత వెనుకబడిన ప్రాంతాలుగు గుర్తింపు పొందిన ఉత్తరాంధ్ర ఇప్పుడు ఆకాశమే హద్దుగా అభివృద్ధికి రెడ్ కార్పెట్ పలుకుతోంది. అనతి కాలంలో విశాఖ రూపు రేఖల్లో విప్లవాత్మక మార్పులు రావడం ఖాయంగా అంతా భావిస్తున్నారు.

(విశాఖపట్నం - జయజయహే)

### రియల్టీలో జోష్..!

గత కొన్నాళ్లుగా విశాఖ కేంద్రంగా జరుగుతున్న అనేక పరిణామాలు ఉత్తరాంధ్ర ప్రజల్లో జోష్ నింపుతున్నాయి. కేవలం విశాఖకే కాకుండా రాష్ట్ర ప్రజలకే గర్వకాణంగా అనేక సరికొత్త మార్పులు భవిష్యత్తులో చోటుచేసుకోబోతున్నాయి. వివిధ రంగాలకు విశాఖ కీలకంగా మారబోతోంది. ఇప్పటికే ఐటీ, ఫార్మా, పోర్టు ఎక్స్ పోర్ట్స్, వంటి రంగాల్లో విశాఖ తనదైన ముద్ర వేస్తోంది. అంతర్జాతీయ, జాతీయ స్థాయి ఎంఎన్ సీ కంపెనీలు విశాఖకు వస్తుండటంతో రియల్ ఎస్టేట్ రంగంలో ఓ వైబ్ వచ్చింది. సాగర నగరంలో రియల్ ఎస్టేట్ చాలాకాలంగా సాగుతున్నప్పటికీ, ఇటీవల కాలంలో కాస్తా స్లో లో నడుస్తోంది. అయితే ఇప్పుడు భోగాపురం ఎయిర్ పోర్టు మరో ఆరు నెలల వ్యవధిలో అందుబాటులోకి వస్తుండటం, ఇప్పటికే ఇన్ఫోసిస్ ఐటీ సంస్థ కార్యకలాపాలు కొనసాగిస్తుండటం, కాగ్నిజెంట్ అనే సంస్థ కార్యకలాపాలు చేపట్టడంతో పాటుగా శాస్వత కార్యాలయానికి విశాఖలో శంకుస్థాపన చేయడం.. దేశీయ టాప్ ఐటీ సంస్థ టీసీఎస్ కూడా విశాఖ నుంచి కార్యకలాపాలు కొనసాగించడానికి, శాస్వత భవన నిర్మాణాలు చేపట్టడానికి ఇదే జనవరిలో ముందడుగు వేయబోతోందనే వార్తలు వస్తున్నాయి. మరోవైపు గూగుల్, మెటా, బ్రూక్ ఫీల్డ్, రిలయన్స్ డేటా సెంటర్లు ఏర్పాటుకు శరవేగంగా ఏర్పాట్లు కొనసాగుతున్న నేపథ్యంలో రియల్ ఎస్టేట్ రంగంలో సరికొత్త ఉత్తేజం ప్రకాశిస్తోంది. దీంతో ఇప్పటికే విశాఖ కేంద్రంగా పని చేస్తున్న రియల్టీ సంస్థలతో పాటుగా దేశంలో ప్రఖ్యాత సంస్థలు కూడా విశాఖలో రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు చేపట్టడానికి ముందుకు వస్తున్నాయి.

### కేవీఅర్ డవలపర్స్ స్పెషాలిటీ..

ఉత్తరాంధ్రలో రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు చేపడుతున్న సంస్థలకు కొదవులేవు. చాలా సంస్థలు లే అవుట్, ప్లాట్ లు, విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీలు వంటివి




నిర్మాణాలు చేస్తూ ముందుకు సాగుతున్నాయి. విశాఖ కేంద్రంగా కాయల వెంకటరెడ్డి (కేవీఆర్) సారథ్యంలో కార్యకలాపాలు సాగిస్తున్న కేవీఆర్ డవలపర్స్ ది మాత్రం ఓ ప్రత్యేక శైలి. ఉత్తరాంధ్ర పరిధిలోని ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల పరిధిలో అద్భుతమైన లే అవుట్ లు, అపార్టమెంట్లు నిర్మాణం చేపట్టి వినియోగదారుల నమ్మకాన్ని కైవశం చేసుకోంది. ప్రభుత్వ నియమ, నిబంధనలు ఖచ్చితంగా పాటిస్తూ, నిర్దేశిత ప్రమాణాలు పాటించడంలో ఏమాత్రం సంకోచించకుండా ముందుకు సాగుతూ కేవీఆర్ డవలపర్స్ అగ్రగామిగా నిలుస్తోంది. విజయనగరం జిల్లా చెల్లూరు సమీపంలో కేవీఆర్ శ్రీ గోల్డన్ సిటీ వెంచర్ ను ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో చేపట్టి దిగ్విజయంగా పూర్తి చేసారు. అలాగే




కేవీఆర్ శక్తిధార్ పేరిట 39 ఎకరాల్లో మరో వెంచర్ ను విజయవంతంగా పూర్తి చేసి కాయల వెంకటరెడ్డి తన సత్తా చాటారు. అదే విధంగా విజయనగరంలోని రామ నారాయణం సమీపంలో ఏడు ఎకరాల విస్తీర్ణంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కేవీఆర్ లేక్ వ్యూ లే అవుట్ విజయనగరానికే తలమానికంగా మారింది. అనతి కాలంలోనే ఈ కీలక ప్రాజెక్టులను చేపట్టి వినియోగదాలు మన్ననలను కేవీఆర్ డవలపర్స్ సొంతం చేసుకోగలిగలిగిందంటే ఆ సంస్థ అధినేత కాయల వెంకటరెడ్డి విజన్ ను అర్థం చేసుకోవచ్చు.







### టెర్రాస్.. టాప్ లెవల్

కేవీఆర్ లగ్జ్ లో టెర్రాస్ ఫ్లోర్ లను అత్యంత ఆధునిక వసతులతో రూపుదిద్దేలా కాయల వెంకటరెడ్డి డిజైన్ చేసారు. మల్టీ పర్పస్ లాన్, ఆల్ రౌండ్ వాక్ వే, సీటింగ్ ఆల్కోవ్స్ విత్ ప్లాంటర్స్, వుడెన్ సీటింగ్ ఏరియా, ఎన్విరాన్ మెంటల్ డెక్ ఎంట్రన్స్, అవుట్ డోర్ టెబుల్ టెన్నిస్, అవుట్ డోర్ చెస్ ప్లే ఏరియా, లాప్ పూల్ విత్ కిడ్స్ పూల్.. వంటి సకల సౌకర్యాలతో రూపుదిద్దుతున్నారు.


### ఇవీ కేవీఆర్ లగ్జ్ హైలెట్స్..

అత్యంత ప్రతిష్టాత్మకంగా కేవీఆర్ డవలపర్స్ ఈ కేవీఆర్ లగ్జ్ ను నిర్మాణం చేస్తోంది. ఈ ప్రాజెక్టుకు గ్రేటర్ విశాఖ నగర పాలక సంస్థ పూర్తి అనుమతులు మంజూరు చేసింది. జీ ప్లస్ 11 లెవల్స్ లో 163 అపార్టమెంట్లు నిర్మాణం చేపడుతోంది. ఇందులో పూర్తిగా అన్నీ 3బీహెచ్ కే లకు పరిమితం చేసారు. నిర్మాణంలో ఎక్కడా రాజీ పడకుండా నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణం చేపడుతున్నట్లు కాయల వెంకటరెడ్డి వెల్లడించారు. 163 ఆపార్టమెంట్ల నిర్మాణానికి సంబంధించి ఎవరికీ ఎటువంటి ఇబ్బంది లేకుండా 3 లెవల్ లో పార్కింగ్ సదుపాయం కల్పిస్తున్నారు. అలాగే నిర్మాణ రంగానికి కీలకమైన వాస్తు ప్రకారం చేపడుతూ, ఈస్ట్ వెస్ట్ ఫేసింగ్ లో యూనిట్స్ అందుబాటులో ఉంటున్నాయి. అలాగే భవిష్యత్తులో ఎవరికీ ఇబ్బంది లేకుండా కామన్ వాల్స్ లేకుండా పక్కా ప్రణాళికతో శరవేగంగా నిర్మాణం జరుగుతోంది. హై ఎండ్ స్పెసిఫికేషన్స్, డిజైనర్ ల్యాండ్ స్కాపింగ్, 24 గంటల నీటి సరఫరా, ప్రతీ అపార్టమెంట్ కు 3కేవీ బ్యాకప్ తో పాటుగా సెక్యూరిటీ ప్లాజా నిరంతరాయంగా పని చేసేలా ప్లాన్ చేసారు. అలాగే యోగా స్టూడియో, వెల్ ఎక్విప్డ్ జిమ్, వెయిటింగ్ లాంజ్, ఆల్ రౌండ్ వాక్ వే వంటి అధునాత సౌకర్యాలు ఈ కేవీఆర్ లగ్జ్ సొంతం.




### ఇవీ అవుట్ డోర్ ఫెసిలిటీస్..

కేవీఆర్ లగ్జ్ ప్రాజెక్టులో అవుట్ డోర్ లనూ అత్యంత కీలకమైన ప్రత్యేక సౌకర్యాలు అందుబాటులోకి తెస్తున్నారు. జాగింగ్ ట్రాక్, అవుట్ డోర్ సీటింగ్, క్రికెట్ నెట్, బాస్కెట్ బాల్ కోర్టు, చిల్డ్రన్ ప్లే ఏరియా, మల్టీ పర్పస్ లాన్, వాటర్ ఫీచర్ విత్ జెట్, సీటింగ్ ప్లాజా, స్టేట్ వాల్ ఫర్ చిల్డ్రన్, అంపీ థియేటర్, బ్యాడ్మింటన్ కోర్టు, స్కలప్చర్, సీనియర్ సిటిజన్స్ సీటింగ్, రిఫ్లాక్సాలజీ పాత్ వే వంటి సదుపాయాలను ఈ ప్రాజెక్టులో అందుబాటులో తీసుకువస్తున్నారు.




### విశాఖకే తలమానికం..,కేవీఆర్ లగ్జ్

అంతర్జాతీయ నగరంలో విశాఖ రూపాంతరం చెందుతున్న నేపథ్యంలో ఆ స్థాయికి.. ప్రమాణాలకు తగ్గట్లుగా సరికొత్త ప్రాజెక్టును కాయల వెంకటరెడ్డి సారథ్యంలోని కేవీఆర్ డవలపర్స్ చేపట్టింది. విశాఖ నగరానికి అత్యంత కీలకమైన ఎండాడ ప్రాంతంలో కేవీఆర్ లగ్జ్ పేరిట ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. అటు ఐటీ హిల్స్ కు సమీపంలో, ఇటు సాగర తీరం.. నగరానికి అనుకున్న ఉన్న ప్రాంతంలో ఈ కేవీఆర్ లగ్జ్ కొలువుదీరుతోంది. నేటి తరం యువత కోరుకునే లగ్జరీ లైఫ్ పతాక స్థాయిలో ఈ నిర్మామాలను కేవీఆర్ డవలపర్స్ చేపడుతోంది. ఎండాడ ప్రాంతంలో నిర్మిస్తోన్న ఈ కేవీఆర్ లగ్జ్ లో కేవలం 3బీహెచ్ కే యూనిట్స్ మాత్రమే అందు బాటులో ఉండేలా కాయల వెంకటరెడ్డి ప్లాన్ చేసారు. అలాగే మొత్తంగా 163 అపార్ట్ మెంట్లు ఈ కేవీఆర్ లగ్జరీలో ఉండేలా ప్రణాళికలు అమలు చేస్తున్నారు.

## స్టైలిష్ లైఫ్ స్టైల్

### కాయల వెంకటరెడ్డి బ్రదర్స్



కేవీఆర్ డవలపర్స్ ఎప్పుడూ కస్టమర్ అభిరుచి.. అభిమితం.. స్టైల్ ప్రతిబింబించేలా మా ప్రణాళికలు సిద్ధం చేస్తాం. జీవితంలో వారు అనుసరించే స్టైల్ ను భవిష్యత్తు విజన్ ను మేం చేసే నిర్మాణంలో సాక్షత్కరిస్తాం. ప్రాథమిక నిర్మాణ స్థాయి నుంచి ఫినిషింగ్ టచ్ వరకు క్వాలిటీతోనే ముందుకు సాగుతుంటాం. కస్టమర్లు మాపట్ల చూపే నమ్మకంతో మేం అంకితభావం.. పట్టుదలతో నిర్మాణం సాగిస్తూ ముందడుగు వేస్తాం. వారి సొంతింటి కల సాకారానికి సహకరిస్తుండటం మాకు గర్వకారణంగా భావిస్తుంటాం..!




Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com